



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 267 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు సోమవారం 1 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :267 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE MON 1 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## గండిపేట భూ కుంభకోణం.. బొల్లా బ్రహ్మనాయుడే కీలక వ్యక్తి: డీసీపీ శ్రీనివాస్



- గండిపేటలో రూ.1500 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాకు భారీ కుట్ర
- ఈ కుంభకోణంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాత్రపై ఆధారాలు
- నకిలీ జీవోల తయారీకి రూ.4 కోట్లు చెల్లించినట్లు డీసీపీ శ్రీనివాస్ వెల్లడి
- ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్ట్ చేసిన సైబరాబాద్ పోలీసులు
- మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారని, గాలింపు కొనసాగుతోందని ప్రకటన

పెన్ పవర్ డెస్క్: హైదరాబాద్ శివారు గండిపేటలో వెలుగు చూసిన భారీ భూ కుంభకోణం కేసులో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. సుమారు రూ.1500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని నకిలీ పత్రాలతో కబ్జా చేసేందుకు జరిగిన ఈ కుట్రలో కీలక వ్యక్తి వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడేనని, అందుకు తమ వద్ద పక్కా ఆధారాలున్నాయని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం నాడు విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన కీలక వివరాలను ఆయన వెల్లడించారు. డీసీపీ శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ కుంభకోణంలో

- మిగతా 2లో



## రొయ్యలకు మేత వేసి, పొలంలో దుక్కి దున్ని...

### సొంతూరులో మంత్రి నిమ్మల...

- ఆదివారం సొంతూరు అగర్తిపాలెంలో పర్యటించిన మంత్రి నిమ్మల రామానాయుడు
- సైకిల్‌పై ప్రయాణించి, తన పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి
- సొంత రొయ్యల చెరువులో మేత వేసి, రొయ్యల ఎదుగుదల పరిశీలన
- జలజీవన్ పైప్‌లైన్ పనుల విషయంలో అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు
- ఈ వివరాలను మంత్రి తన సోషల్ మీడియా ఖాతాలో స్వయంగా పంచుకున్న వైనం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం తన సెలవు దినాన్ని వినూత్నంగా గడిపారు. రాజకీయాలతో నిత్యం బిజీగా ఉండే ఆయన, కాస్త విరామం దొరకడంతో తన సొంతూరులో రైతుగా మారిపోయారు. వ్యవసాయ పనుల్లో పాల్గొని, క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించారు. ఆదివారం తెల్లవారుజామున పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నుంచి సైకిల్‌పై బయలుదేరిన రామానాయుడు, 7 కిలోమీటర్ల దూరంలో

- మిగతా 2లో

## జూన్ 2 నుంచి రష్యాలో నారా లోకేష్ పర్యటన...

# పెట్టుబడులే టార్గెట్

- రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో మంత్రి లోకేష్ రష్యా పర్యటన
- జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు రష్యాలో పర్యటించనున్న లోకేష్
- సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక ఫోరంలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం
- పర్యటనలో భాగంగా పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ కానున్న మంత్రి



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటించనున్నారు. జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు ఆయన రష్యాలో పర్యటించి, పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి, వారిని ఏపీకి ఆహ్వానించడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం.రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక 'సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరమ్' (ఎస్పీఐఈఎఫ్'26) సదస్సులో పాల్గొనాల్సిందిగా మంత్రి లోకేష్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారు. ఈ పర్యటనలో భాగంగా, లోకేష్ పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ముఖ్యంగా ఐటీ, విద్య, ఇతర కీలక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన చర్చలు జరపనున్నారు. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం.. ఆమరణ దీక్ష చేస్తానంటూ ప్రభుత్వానికి షర్మిల హెచ్చరిక

- నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసంపై షర్మిల ఆగ్రహం
- ఇది చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపేనని ఆరోపణ
- పోలీసులు చూస్తూ ఉన్నా దాడిని ఆపలేదని విమర్శ
- విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్ష చేస్తానని హెచ్చరిక
- నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్




పెన్ పవర్ డెస్క్:నంద్యాల జిల్లాలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు.

- మిగతా 2లో

## విశాఖ రైల్వే జోన్ నేటి నుంచే... సీఎం చంద్రబాబు ఏమన్నారంటే!

- జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభం
- ఇది చారిత్రాత్మక మైలురాయి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- దశాబ్దాల కల నెరవేరిందని హర్షం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి
- ఆకాంక్షను నెరవేర్చిన ప్రధాని మోదీకి, రైల్వే మంత్రికి ధన్యవాదాలు
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ జోన్ కీలకం కానుందని వెల్లడి

- మిగతా 2లో






## వియత్నాం చేతికి 'బ్రహ్మోస్' అస్త్రం.. డీల్ ఖరారు చేసిన భారత్

- వియత్నాంకు బ్రహ్మోస్ క్షిపణుల అమ్మకంపై భారత్ ఒప్పందం పూర్తి
- ఇండోనేషియాతోనూ ఇదే తరహా ఒప్పందం తుది దశలో ఉందని వెల్లడి
- సింగపూర్‌లో రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ కీలక ప్రకటన
- దక్షిణ చైనా సముద్ర ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఒప్పందాలకు ప్రాధాన్యం
- రక్షణ ఎగుమతులను భారీగా పెంచుకోవడంపై భారత్ దృష్టి

పెన్ పవర్ డెస్క్:రక్షణ రంగ ఎగుమతుల్లో భారత్ మరో కీలక మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి 'బ్రహ్మోస్'ను వియత్నాంకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే తరహా ఒప్పందం ఇండోనేషియాతో కూడా తుది దశలో ఉందని భారత రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ వెల్లడించారు. సింగపూర్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక షాంగ్రీ-లా డైలాగ్ భద్రతా సదస్సులో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు."వియత్నాంతో బ్రహ్మోస్ ఒప్పందం ఇప్పటికే పూర్తయింది. బహుశా బహిరంగంగా ప్రకటించనప్పటికీ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఇండోనేషియాతో చర్చలు కూడా తుది దశకు చేరుకున్నాయి. త్వరలోనే ఒప్పందం ఖరారు కావచ్చు" అని రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు.

- మిగతా 2లో

## విశాఖ-విజయవాడ మధ్య బుల్లెట్ రైలు.. ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ కీలక ప్రకటన



- విశాఖపట్నం-విజయవాడ మధ్య బుల్లెట్ రైలు వస్తుందన్న మాధవ్
- కేవలం గంటన్నరలోనే 350 కిలోమీటర్ల ప్రయాణం
- కేంద్ర మంత్రి చెప్పారని వెల్లడించిన ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్
- ప్రాజెక్టు సర్వే కోసం రైల్వే బోర్డుకు అధికారుల ప్రతిపాదన
- విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్

- మిగతా 2లో

## ఉగ్రవాదులకు సాయంగా భారత్‌లోకి అక్రమంగా టెలికామ్ సంకేతాలు

పెన్ పవర్ డెస్క్:ఉగ్రవాద పోషణలో పాక్ వంకర బుద్ధి మారడంలేదు. జమ్మూ కశ్మీర్‌లోని ఉగ్ర నెట్‌వర్క్‌ల కోసం అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ నిబంధనల ఉల్లంఘనలకు కూడా పాల్పడుతోంది. ఇందుకోసం సరిహద్దుల వెంట భారత్ వైపు అక్రమంగా

- మిగతా 2లో



## ఆ విషయం చిట్‌చాట్‌లో చెప్పడం కాదు... అధికారికంగా ప్రకటించాలి

- రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌పై చిట్‌చాట్‌లో కాకుండా అధికారికంగా ప్రకటించాలన్న కవిత
- రైతు డిస్కం పేరుతో మిగతా డిస్కంలను ప్రైవేటీకరించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపణ
- ఈ ప్రైవేటీకరణ కుట్రను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అంశంపై మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడటం కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

- మిగతా 2లో

## ఇరాన్‌తో డీల్‌పై ట్రంప్ వెనకడుగు.. చర్చలంటూనే దాడి హెచ్చరికలు

- ఇరాన్‌తో ఒప్పందంపై ట్రంప్ అధ్యక్షతన భేటీ
- ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసిన సమావేశం
- అణ్వాయుధాన్ని వదులుకోవాలి, హర్మూజ్ జలసంధిని తెరవాలని యూఎస్ షరతులు
- ఒప్పందం విఫలమైతే దాడులకు సిద్ధమని ప్రకటించిన అమెరికా రక్షణ మంత్రి
- చర్చలపై నమ్మకం లేదని, క్షిపణులే తమ బలమని ఇరాన్ స్పష్టీకరణ

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# టెన్షన్ మళ్లీ

ఇరాన్ నౌకాశ్రయాలపై అమలు చేస్తున్న దిగ్బంధనాన్ని ఛేదించేందుకు ప్రయత్నించిన ఓ వాణిజ్య నౌకపై అమెరికా సైన్యం క్షిపణి ప్రయోగించింది. నౌక ఇంజిన్ గదిని లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ శనివారం వెల్లడించింది. గాంబియా జెండాతో ప్రయాణిస్తున్న 'లియాన్ స్టార్' కార్గో నౌక ఇరాన్ నౌకాశ్రయంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించింది. దీనిపై అమెరికా బలగాలు రాత్రి సమయంలో 20కి పైగా హెచ్చరికలు జారీ చేసినా నౌక స్పందించలేదని తెలిపాయి. ప్రస్తుతం ఆ నౌక ఒమన్ గల్ఫ్‌లో నిలిచిపోయిందని, ఇంకా దానిపై అమెరికా బలగాలు ఎక్కలేదని సైనిక చర్యలపై అవగాహన ఉన్న ఓ అమెరికా అధికారి చెప్పారు. అమెరికా దిగ్బంధనాన్ని ఉల్లంఘించేందుకు ప్రయత్నించిన ఆరు నౌకలను ఇప్పటివరకు అడ్డుకున్నట్లు సైన్యం వెల్లడించింది. వాటిలో ఒకదానికి అనుమతి ఇచ్చారు. మరో 116 నౌకలను ఇతర మార్గాలకు మళ్లించినట్లు తెలిపింది.

**కాల్పుల విరమణ పొడిగింపుపై ఉత్కంఠ...**

ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో ప్రారంభమైన మధ్యప్రాచ్య యుద్ధం తర్వాత ఇరాన్ హోర్ముజ్ జలసంధిని సమర్థంగా మూసివేసిందని పేర్కొంటూ అమెరికా ఏప్రిల్ 17న దిగ్బంధనం ప్రారంభించింది. ఏప్రిల్ 7 నుంచి సున్నితమైన కాల్పుల విరమణ కొనసాగుతోంది. ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు జరిపే సమయంలో ఈ కాల్పుల విరమణను మరో 60 రోజులు పొడిగించే ఒప్పందం కుదురుతుందా అనే అంశంపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. ఇరాన్, ఒమన్‌ల మధ్య ఉన్న హోర్ముజ్ జలసంధిలో పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. భారీ స్థాయిలో చమురు, సహజవాయువు, ఎరువుల వంటి సరఫరాలు నిలిచిపోవడంతో వినియోగదారులు, ఆహార ఉత్పత్తిదారులపై ఒత్తిడి పెరుగుతోంది. దిగ్బంధనం ద్వారా ఇరాన్ ఎగుమతులను పరిమితం చేసి, నగదు ప్రవాహాన్ని తగ్గించాలన్నదే అమెరికా లక్ష్యంగా కనిపిస్తోంది. ఇప్పటికే బలహీనపడిన ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై మరింత ఒత్తిడి తీసుకురావాలని చూస్తోంది.

**ఇంకా నిర్ణయం తీసుకోని ట్రంప్...**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం తన సలహాదారులతో సమావేశమయ్యారు. అయితే కాల్పుల విరమణ పొడిగింపు, జలసంధి పునఃప్రారంభంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ఈ ఒప్పందం ఇంకా ఖరారు కాలేదని ఇరాన్ పేర్కొంది. ఇరాన్ అనుమతి తప్పనిసరి అని ప్రకటిస్తున్నప్పటికీ, వాణిజ్య నౌకల రాకపోకలు నిశ్శబ్దంగా కొనసాగుతున్నాయి. అయితే యుద్ధానికి ముందు ఉన్న స్థాయితో పోలిస్తే వాటి సంఖ్య గణనీయంగా తగ్గింది. "ఈ నిబంధనలను ఉల్లంఘించే ఏ చర్య అయినా వారి ప్రయాణ భద్రతకు తీవ్ర ముప్పు కలిగిస్తుంది" అని ఇరాన్ సంయుక్త సైనిక కమాండ్ శనివారం హెచ్చరించింది. తమ చర్యల్లో జోక్యం చేసుకునే సైనిక నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని తెలిపింది. ఇరాన్ జలసంధి గుండా వెళ్లే నౌకల నుంచి గరిష్ఠంగా 20 లక్షల డాలర్ల వరకు రుసుము వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇది శాంతియుత సముద్ర రాకపోకల స్వేచ్ఛ అనే అంతర్జాతీయ సముద్ర వాణిజ్య సూత్రానికి విరుద్ధమని నిపుణులు చెబుతున్నారు.

**అంతర్జాతీయ సముద్ర వాణిజ్యానికి...**

షేక్ సౌద్ బిన్ అబ్దుల్రహ్మాన్ బిన్ హసన్ బిన్ అలీ అల్ థానీ మాట్లాడుతూ, సాధారణ పరిస్థితుల్లో రాకపోకలపై రుసుములు విధించడాన్ని తమ దేశం వ్యతిరేకిస్తుందని చెప్పారు. అయితే మైన్ల తొలగింపు వంటి తాత్కాలిక అవసరాల కోసం పరిమిత కాలం రుసుములు వసూలు చేయడం చర్చించదగిన అంశమని వ్యాఖ్యానించారు. అలాంటి చర్యలు హోర్ముజ్ జలసంధిలో సాధారణ పరిస్థితులు పునరుద్ధరించడానికి తోడ్పడవచ్చని అన్నారు. అమెరికా అధికారులు ఇప్పటికే తెలిపిన వివరాల ప్రకారం, హోర్ముజ్ జలసంధిలో ఇప్పటివరకు ఎలాంటి మైన్లను గుర్తించలేదని, వాటిని నిర్వీర్యం చేసిన దాఖలాలు కూడా లేవని వెల్లడించారు.

## గండిపేట భూ కుంభకోణం.. బొల్లా బ్రహ్మనాయుడే కీలక వ్యక్తి: డీసీపీ శ్రీనివాస్

- మొదటి పేజి తరువాయి

బొల్లా బ్రహ్మనాయుడి పాత్ర అత్యంత కీలకంగా ఉంది. గండిపేటలోని వివాదాస్పద భూమిని క్రమబద్ధీకరించినట్లుగా నకిలీ ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) సృష్టించేందుకు, ప్రధాన నిందితుడైన రాధాకృష్ణకు బ్రహ్మనాయుడు రూ.4 కోట్లు చెల్లించినట్లు విచారణలో తేలిందని డీసీపీ తెలిపారు. ఈ లావాదేవీలన్నీ నగదు రూపంలోనే జరిగాయని, ఈ సొమ్ము ఎక్కడికి వెళ్లిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కుట్రలో భాగంగా నిందితులు అత్యంత పకడ్బందీగా నకిలీ పత్రాలు సృష్టించారని, కలెక్టర్, సీసీఎల్ఏ కార్యాలయాల నుంచి అనుమతులు వచ్చినట్లు నకిలీ దస్త్రాలు, ఐఏఎస్ అధికారుల ఫోర్జరీ సంతకాలతో ఉత్తర్వులు తయారు చేశారని వివరించారు. గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఈ కేసును నమోదు చేసినట్లు డీసీపీ తెలిపారు. వాట్సాప్ గ్రూపులలో నకిలీ జీవోలు సర్క్యులేట్ కావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఇప్పటికే నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌లతో పాటు ప్రధాన నిందితుడు రాధాకృష్ణ, అతని డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు డీసీపీ వెల్లడించారు. ఇప్పటికే 9 కేసులలో నిందితుడిగా ఉన్న రాధాకృష్ణ నుంచి కందుకూరు, అంబర్‌పేట ప్రాంతాలకు చెందిన పలు భూముల పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల నుంచి నకిలీ జీవో కాపీలు, 13 నకిలీ స్టాంపులు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, చెక్‌బుక్కులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గండిపేటలోని సర్వే నంబర్ 18లో ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ఈ కుట్ర పన్నారు. దీని విలువ మార్కెట్ అంచనాల ప్రకారం రూ.1000 నుంచి రూ.1500 కోట్ల వరకు ఉంటుంది. ఇప్పటికే ఈ భూమికి సంబంధించిన యాజమాన్య హక్కుల పిటిషన్‌ను 2025లోనే హైకోర్టు కొట్టివేసినప్పటికీ, ఇంత విలువైన భూమిపై ఒప్పందాలు చేసుకోవడం అనుమానాలకు తావిస్తోందని డీసీపీ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసులో బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్‌తో పాటు మరికొందరు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని డీసీపీ శ్రీనివాస్ వివరించారు. నగదు రూపంలో జరిగిన కోట్ల రూపాయల లావాదేవీలపైనా దృష్టి సారించి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం.. ఆమరణ దీక్ష చేస్తానంటూ ప్రభుత్వానికి షర్మిల హెచ్చరిక

- మొదటి పేజి తరువాయి

విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్షకు దిగుతానని కూటమి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబును ఆమె హెచ్చరించారు. ఈ ఘటనను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నంద్యాలలోని శ్రీనివాస సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహంపై ఓ వ్యక్తి దాడి చేసి ధ్వంసం చేశాడని షర్మిల తెలిపారు. పట్టపగలు ఈ ఘటన జరుగుతుంటే, అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకపోవడం హేయమైన చర్య అని ఆమె విమర్శించారు. దాడి చేసిన వ్యక్తికి మానసిక స్థితి బాగోలేదని చెప్పి పోలీసులు చేతులు దులుపుకోవడం సరికాదని అన్నారు. ఇది చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపు ఉందని షర్మిల ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి ఘటనలను చూస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ విగ్రహాలపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడితో పాటు, అతని వెనుక ఉన్న శక్తులెవరో తేల్చి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

పాత విగ్రహం స్థానంలో వెంటనే కొత్తది ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో నంద్యాలలో అదే సెంటర్‌లో తాను ఆమరణ దీక్షకు దిగుతానని ముఖ్యమంత్రిని హెచ్చరించారు.

## రొయ్యలకు మేత వేసి, పొలంలో దుక్కి దున్ని...

- మొదటి పేజి తరువాయి

ఉన్న తన సొంతూరు అగర్తిపాలెం చేరుకున్నారు. అక్కడ తన రొయ్యల చెరువులో మేత వేసి, రొయ్యల ఎదుగుదలను పరిశీలించారు. అనంతరం వరి పొలంలోకి దిగి, ట్రాక్టర్‌తో స్వయంగా దుక్కి దున్నారు. కూలీలతో మాట్లాడారు. ఆ తర్వాత, గ్రామస్థులతో కలిసి శ్రమదానంతో అభివృద్ధి చేస్తున్న హిందూ శ్మశానవాటిక పనుల పురోగతిని సమీక్షించారు.
తిరిగి పాలకొల్లుకు సైకిల్‌పై పయనం అవుతుండగా, రోడ్డు పక్కన వేస్తున్న జలజీవన్ మిషన్ పైపులైన్‌ను గమనించారు. భవిష్యత్తులో మరమ్మతుల కోసం కొత్తగా మంజూరైన సిమెంట్ రోడ్డును తవ్వాల్సిన అవసరం రాకుండా, పైప్‌లైన్‌ను పక్కగా వేయాలని ఆర్అండ్‌బీ అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు.ంఈ పర్యటన వివరాలను ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. "సెలవు రోజున కొద్దిపాటి సమయం దొరకడంతో సొంత వ్యవసాయ పనుల్లో పాల్గొనడం ఎంతో సంతృప్తి, ఆనందం కలిగించింది" అని ఆయన పేర్కొన్నారు.

## విశాఖ-విజయవాడ మధ్య బుల్లెట్ రైలు..

ఆంధ్రప్రదేశ్‌లో రవాణా రంగానికి సంబంధించి ఒక శుభవార్త వెలువడింది. విశాఖపట్నం-విజయవాడ నగరాల మధ్య బుల్లెట్ రైలు (హైస్పీడ్ రైల్) ప్రాజెక్టును తీసుకురానున్నట్లు ఏపీ బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ వెల్లడించారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్వయంగా తనకు ఈ విషయాన్ని తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాలిస్తే, ఇరు నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. మరోవైపు, దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ (ాశీబ్ష్ర జశ్ఖీర్ ఙఱశ్రీఖ్వ్గ శీఅవ) రేపటి నుంచి (జూన్ 1) విశాఖపట్నం కేంద్రంగా అధికారిక కార్యకలాపాలు ప్రారంభించనుందని మాధవ్ స్పష్టం చేశారు. ఈ జోన్ సాధన కోసం బీజేపీ సుమారు 30 ఏళ్లుగా పోరాటం చేసిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం విశాఖ-విజయవాడ మధ్య రైలు ప్రయాణానికి 5 నుంచి 6 గంటల సమయం పడుతోంది. బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే, ఈ 350 కిలోమీటర్ల దూరాన్ని కేవలం గంటన్నరలోనే పూర్తి చేయవచ్చని అంచనా. ఈ రైలును తొలుత గంటకు 320 కిలోమీటర్ల వేగంతో నడపాలని, భవిష్యత్తులో వేగాన్ని మరింత పెంచాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ కారిడార్ విజయవాడ నుంచి ఏలూరు, రాజమండ్రి, కాకినాడ మీదుగా విశాఖపట్నం చేరేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.
ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 'ఫైనల్ లొకేషన్ సర్వే' అనుమతుల కోసం క్షేత్రస్థాయి అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపారు. దేశవ్యాప్తంగా ప్రకటించిన ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లలో ఏపీ మీదుగా ఇప్పటికే మూడు వెళు ్తండగా, ఇది రాష్ట్రానికి అదనపు ప్రయోజనం చేకూర్చనుంది. దీంతో పాటు విజయవాడ-కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్ కారిడార్ ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది. ఈ కొత్త ప్రాజెక్టులు ఉత్తరాంధ్రతో పాటు మొత్తం రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిస్తాయని భావిస్తున్నారు.

## విశాఖ రైల్వే జోన్ నేటి నుంచే... సీఎం చంద్రబాబు ఏమన్నారంటే!

విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ రేపు (జూన్ 1న) అధికారికంగా ప్రారంభం కానుండటంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక మైలురాయి అని, దశాబ్దాల కల నెరవేరుతోందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన రైల్వే జోన్‌తో ఉత్తరాంధ్ర రవాణా ముఖచిత్రం సమూలంగా మారిపోతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. దీనివల్ల కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించబడటంతో పాటు పారిశ్రామిక వృద్ధికి కూడా బాటలు పడతాయని తెలిపారు. రాష్ట్రాన్ని ఒక లాజిస్టిక్స్ హబ్‌గా మార్చే ప్రభుత్వ లక్ష్యానికి ఈ పరిణామం ఎంతో దోహదపడుతుందని వివరించారు.

ఏపీ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు రాష్ట్ర ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చంద్రబాబు తన ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త రైల్వే జోన్ ఏర్పాటుతో ఈ ప్రాంత అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఇరాన్‌తో డీల్‌పై ట్రంప్ వెనకడుగు.. చర్చలంటూనే దాడి హెచ్చరికలు

ఇరాన్‌తో అణు ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షతన వైట్‌హౌస్‌లో జరిగిన కీలక సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ భేటీ నుంచి ట్రంప్ ఏ నిర్ణయం ప్రకటించకుండానే వెళ్ళిపోయారని అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) పేర్కొంది. దీంతో ఇరు దేశాల మధ్య కుదిరిందని భావించిన తాత్కాలిక ఒప్పందం భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ సమావేశానికి ముందు ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, ఇరాన్‌తో ఒప్పందం జరగాలంటే కొన్ని కఠిన షరతులు విధించారు. సంఘర్షణల కారణంగా మూతపడిన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలని, ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని తయారు చేయబోమని స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను తమకు అప్పగించాలన్నది కూడా తమ ప్రధాన షరతుల్లో ఒకటని ట్రంప్ స్పష్టం చేశారు. అయితే, అమెరికా పెడుతున్న ఈ షరతులను ఇరాన్ మొదటి నుంచి వ్యతిరేకిస్తోంది. ఒకవైపు చర్చల ప్రక్రియ కొనసాగుతుండగానే, అమెరికా తన కఠిన వైఖరిని ప్రదర్శించింది. ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించడానికి తాము సిద్ధంగా ఉన్నామని అమెరికా యుద్ధ కార్యదర్శి పీట్ హెగ్సెత్ హెచ్చరించారు. సింగపూర్‌లో జరిగిన షాంగ్రీ-లా డైలాగ్‌లో ఆయన మాట్లాడుతూ.. "అవసరమైతే దాడులను పునఃప్రారంభించే సామర్థ్యం మాకుంది. మా ఆయుధ నిల్వలు అందుకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు. అధ్యక్షుడు ట్రంప్ ఒక మంచి ఒప్పందం కోరుకుంటున్నారని, కానీ ఇరాన్ అణు ఆశయాలను అరికట్టేలా అది ఉండాలని స్పష్టం చేశారు. మరోవైపు అమెరికా దౌత్యపరమైన హామీలపై తమకు నమ్మకం లేదని ఇరాన్ తెలిపింది. గతంలో చర్చలు జరుగుతున్నప్పుడే తమపై రెండుసార్లు దాడులు జరిగాయని గుర్తుచేసింది. ఇరాన్ రాయభారి మహమ్మద్ బఘేర్ ఖలీబాఫ్ మాట్లాడుతూ.. "మాకు హామీలు లేదా మాటలపై నమ్మకం లేదు, కేవలం చర్యలనే విశ్వసిస్తాం. చర్చల ద్వారా కాదు, క్షిపణుల ద్వారానే మాకు రాయితీలు లభిస్తాయి" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ మాజీ కమాండర్ మొహసెన్ రెజాయీ కూడా ట్రంప్ ఉద్దేశాలను అనుమానించారు. దౌత్యానికి ట్రంప్ మూడోసారి ద్రోహం చేస్తున్నారని, చర్చల పేరుతో ఇతర లక్ష్యాలను నెరవేర్చుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ పరిణామాలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మళ్లీ పెరిగాయి.

## ఉగ్రవాదులకు సాయంగా భారత్‌లోకి అక్రమంగా టెలికామ్ సంకేతాలు

- మొదటి పేజి తరువాయి

సెల్యూలర్ సంకేతాలను పంపిస్తోంది. ఇది ఉగ్రవాదుల రహస్య కమ్యూనికేషన్లకూ ఊపిరిగా ఉపయోగపడుతోందని అధికారులు వెల్లడించారు.
ఇటీవల పాకిస్థాన్ చర్యలు అధికారుల అనుమానాలను మరింత బలపరుస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ పీర్ పంజాల్ పర్వతశ్రేణుల్లో చొరబాట్లు పెరుగుతున్నాయి. దీనికి తోడు నియంత్రణ రేఖకు అటువైపు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఏర్పాటు చేసిన సెల్ టవర్ల సంకేతాలు కరుడు గట్టిన ఉగ్రవాదులున్న జైళ్లకు చేరుతున్నాయి. కశ్మీర్‌లోని పర్వతశ్రేణులు సహజంగా చాలా వరకు సంకేతాలను అడ్డుకొంటున్నా.. మైదాన ప్రాంతం ఉన్న జమ్మూలో మాత్రం ఈ సంకేతాలు భారత్‌లోకి చొరబడి ఉగ్రనెట్‌వర్క్‌లకు చేరుతున్నాయి. ముఖ్యంగా కతువా, రాజౌరీ, పూంచ్ జిల్లాలు, జమ్మూలోని కోట్ బల్వాల్ జైలు వంటి ప్రదేశాల వద్ద పాక్ టెలికామ్ సిగ్నల్స్‌ను మన దళాలు గుర్తించాయి. కొన్ని జైళ్లలో ఇప్పటికే జామర్లను ఏర్పాటు చేసినా వీటిని అడ్డుకోవడంలో విఫలం అవుతున్నాయి. అక్రమంగా కారాగారాల్లోకి చేరిన ఫోన్లను ఖైదీలు వినియోగిస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లో మొత్తం 14 జైళ్లు, రెండు కరెక్షన్ హోమ్‌లు ఉన్నాయి.
పాకిస్థాన్ టవర్లు చైనాకు చెందిన సీడీఎంఏ టెక్నాలజీని వినియోగిస్తున్నాయి. వీటిల్లో అత్యున్నత స్థాయి ఎన్‌క్రిప్షన్ సాధ్యమవుతుంది. ఇది ఉగ్రవాదులు వాడే వైఎస్ఎంఎస్‌కు ఉపయోగపడుతుంది. సీడీఎంఏ పలు సిగ్నల్స్‌ను ఏకకాలంలో అనుమతిస్తుంది. దీంతో భద్రతా ఏజెన్సీల ఎలక్ట్రానిక్ మానిటరింగ్ సమస్యాత్మకంగా మారుతుంది. దీంతో ఉగ్రవాదులు వైఎస్ఎంఎస్ టెక్నాలజీని విరివిగా వాడుతున్నారు. దీంతో పాక్ పంపే సిగ్నల్స్‌తో పీవోకేలోని హ్యాండ్లర్లు, చొరబాటుదారులు, వారికి ఆశ్రయం ఇచ్చే వారితో నిరంతరం టచ్‌లో ఉంటున్నారు. ఈ అక్రమ విధానాలతో పాకిస్థాన్ ఐరాస అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ రాజ్యాంగంలోని 45 ఆర్టికల్‌ను ఉల్లంఘిస్తోందని అధికారులు వెల్లడించారు. ఈ ఆర్టికల్ ప్రకారం ఒప్పందంపై సంతకాలు చేసిన మొత్తం 193 దేశాలు తమ భూభాగం నుంచి అధిక, రోగ్, తప్పుడు, తప్పుదోవ పట్టించే సంకేతాలు పక్కదేశాల్లోకి వెళ్లకుండా సహకరించుకోవాలి.

## వియత్నాం చేతికి 'బ్రహ్మోస్' అస్త్రం.. డీల్ ఖరారు చేసిన భారత్

- మొదటి పేజి తరువాయి

నివేదికల ప్రకారం వియత్నాంతో కుదిరిన ఒప్పందం విలువ సుమారు రూ. 5,800 కోట్లు. ఇందులో భాగంగా తీరప్రాంత రక్షణ క్షిపణి వ్యవస్థలు, తొలి విడత క్షిపణులు, శిక్షణ, ఇతర సాంకేతిక సహకారం అందించనున్నారు. భవిష్యత్తులో వియత్నాం గగనతలం నుంచి ప్రయోగించే బ్రహ్మోస్ క్షిపణులను కూడా కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ సుమారు 375 మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందంతో బ్రహ్మోస్‌ను కొనుగోలు చేసిన తొలి విదేశీ దేశంగా నిలిచింది. ఇప్పుడు వియత్నాం, త్వరలో ఇండోనేషియా కూడా ఈ జాబితాలో చేరనున్నాయి.
దక్షిణ చైనా సముద్రంలో చైనాతో తీవ్రమైన ప్రాదేశిక వివాదాలు ఎదుర్కొంటున్న వియత్నాం, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలు తమ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకుంటున్న తరుణంలో ఈ ఒప్పందాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ధ్వని కన్నా మూడు రెట్ల వేగంతో (మాక్ 3) ప్రయాణించే బ్రహ్మోస్ క్షిపణిని భూమి, గాలి, సముద్రం నుంచి ప్రయోగించవచ్చు. దీని వేగం, కచ్చితత్వం కారణంగా శత్రువుల యుద్ధ నౌకలను, కీలక సైనిక స్థావరాలను వేగంగా ఛేదించగలదు.
2020 గల్వాన్ ఘర్షణల తర్వాత చైనాతో సంబంధాలు ఉద్రిక్తంగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో తన వ్యూహాత్మక ప్రభావాన్ని పెంచుకోవాలని భారత్ భావిస్తోంది. రక్షణ ఎగుమతులను 2030 నాటికి రూ. 50,000 కోట్లకు చేర్చాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. మలేషియా, థాయ్‌లాండ్ వంటి ఇతర ఆగ్నేయాసియా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.

## ఆ విషయం చిట్‌చాట్‌లో చెప్పడం కాదు... అధికారికంగా ప్రకటించాలి

- మొదటి పేజి తరువాయి

ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయానికి మీటర్లు బిగించేది లేదని కూడా ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలతో ముందుకెళుతున్నాయని ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలో కొత్తగా రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కవిత ఆరోపించారు. ఈ పేరుతో మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కుట్రను అడ్డుకోవడానికి అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరించారు. అదేవిధంగా, కేంద్రం తీసుకొచ్చిన కొత్త సోలార్ జీవో కేవలం బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తుందని ఆమె విమర్శించారు.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును దసరా నాటికి ప్రతిపాదించకపోతే, తాను పాదయాత్ర చేపడతానని కవిత హెచ్చరించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటనపై కవిత తీవ్రంగా స్పందించారు. ఇది చాలా దారుణమని, దీనికి ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులే బాధ్యత వహించాలన్నారు. ఆ చిన్నారి పేరిట ప్రభుత్వం రూ.25 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

# ప్రధాని మోదీ మన్ కీ బాత్ -దేశ ప్రగతికి ప్రతీక

**గిద్దలూరు , పెన్ పవర్ మే 31**

ప్రతినెలా చివరి ఆదివారం ఆకాశవాణి,దూరదర్శన్ ద్వారా దేశ ప్రధాని నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమం దేశ ప్రగతిని, వికాసాన్ని ప్రతిబింబిస్తుందని గిద్దలూరు బిజెపి నాయకులు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యక్రమంలో కార్యక్రమాన్ని వీక్షించినవారిలో అప్పిశెట్టి ఉదయ్ శంకర్,భవనాశి రామాంజనేయులు తదితరులు ఉన్నారు.



పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

## వైసిపి ఓటర్ల తొలగింపు పట్ల

# అప్రమత్తంగా ఉండాలి

*జీవనోపాధి కోసం వలస వెళ్లిన వైసీపీకి చెందిన ఓట్లను తొలగించే ప్రమాదం పొంచి ఉన్నది*

*ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచుకొని అక్రమంగా వైసిపి ఓట్ల తొలగింపును అడ్డుకోవాలి*

*బి ఎల్ ఏ లకు సూచనలు సలహాలు ఇచ్చిన వైసిపి గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి.*





కొమరోలు పెన్ పవర్ మే 31

వైఎస్ఆర్ సీపీకి చెందిన సానుభూతిపరులు ,కార్యకర్తల ఓట్లను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని ఆ కుట్రలను బిఎల్ఏలు అడ్డుకోవాలని గిద్దలూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి మండలంలోని బి ఎల్ ఓ లకు సూచించారు. ఆదివారం కొమరోలు లోని వైసీపీ కార్యాలయంలో మండలంలోని బిఎల్ఎ లతో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి కొమరోలు జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు అధ్యక్షత వహించగా, గిద్దలూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి, కొమరోలు మండల వైసీపీ పరిశీలకులు ఓసూరారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు .ఆ సందర్భంగా బిఎల్ఏ లను ఉద్దేశించి నాగార్జున రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థలు ఎన్నికలు జరగనున్నాయని అన్నారు. ఆ ఎన్నికలలో కూటమి పార్టీలో అభ్యర్థులు అక్రమంగా గెలుపొందుటకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని తెలిపారు. వైసీపీ నాయకులను కార్యకర్తలను బెదిరించి అక్రమంగా గెలుపొందాలనే కూటమి పార్టీల నాయకుల ఆటలు చెల్లవని, వారి ఆటలను, ఆగడాలను, బెదిరింపులను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు కార్యకర్తలు సంసిద్ధంగా ఉన్నారనే వాస్తవం కూటమి పార్టీల నేతలకు కూడా తెలుసునని అన్నారు. అయితే అక్రమ మార్గంలో గెలుపొందాలని కుట్రలు చేస్తున్నారని అందులో భాగంగా వైసిపి పార్టీకి చెందిన కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్లను తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని పేర్కొన్నారు . కేవలం తాత్కాలికంగాలికంగా గ్రామాలలో లేరనే సాకుతో జీవనోపాధి కోసం వలస వెళ్లిన వైసీపీ పార్టీకి చెందిన కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్లను తొలగించే ప్రమాదం ఉన్నదని, అందువల్ల ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపుల కార్యక్రమాల కోసం వచ్చే అధికారులు, సిబ్బంది చేపట్టే కార్యక్రమాలను గమనిస్తూ ఉండాలని తెలిపారు. వార్డులు, బూతుల వారిగా ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచుకొని అధికారులు సిబ్బంది సందర్శన నిమిత్తం వచ్చిన సమయంలో వారు ఓటమి పార్టీల నాయకుల ఒత్తిడితో వైసిపి పార్టీకి చెందిన కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్లను తొలగించడానికి చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని ఆయన సూచించారు. కూటమి పార్టీల నేతలు, ఎన్యుమరేషన్ అధికారులు, సిబ్బంది ఏవైనా అక్రమాలకు పాల్పడితే వెంటనే తమకు తెలియజేయాలని తాము న్యాయపోరాటం ద్వారా వారి ఆగడాలను అడ్డుకుంటామని అంటూ బియల్ ఏలకు దిశా నిర్దేశం చేశారు. ఆ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు, కొమరోలు మండల వైసీపీ సీనియర్ నాయకులు నాదెళ్ల వెంగయ్య చౌదరి ,వైసిపి జిల్లా ప్రచార కమిటీ సమన్వయకర్త చదుళ్ళ వెంకట రమణారెడ్డి, గిద్దలూరు నియోజకవర్గ వైసిపి ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షులు బంగారు విశ్వరూపం, కొమరోలు మండల పరిషత్ ఉపాధ్యక్షులు షేక్ మౌలాలి, ఎంపీటీసీలు ఎస్ఎం సుభాని, తిరుపతి రాజు, సారే సుజాత, జాజం వెంకటరమణ, మండల వైసీపీ నాయకులు గోల్కొండ అబ్దుల్ సుభాన్, గోల్కొండ అబ్దుల్ సత్తార్, గుడిపాటి ప్రసాద్, బాదర్ రెడ్డి, ఉల్లాపు రామచంద్రుడు, తోపాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన బిఎల్ఏలు వైసీపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

*-నేటి నుంచి కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ*

*-జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి*

*-జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు*

**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం మే 31**

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జూన్ నెల 1వ తేదీన సోమవారం ఒంగోలు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వేసవి కాలం ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని ప్రజలు మార్పును గమనించాలని కోరారు. ప్రజలు నిర్దేశించిన సమయానికి కార్యక్రమానికి చేరుకొని వారి వారి సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేయాలని సూచించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

### ఎమ్మెల్యే ఆశోక్ రెడ్డి




**గిద్దలూరు పెన్ పవర్ మే 31**

అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కొండంత అండగా నిలుస్తున్నారు. ఆదివారం ఉదయం గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైనా చెక్కులను ఎమ్మెల్యే ఆశోక్ రెడ్డి లబ్ధిదారులకు రూ. 5,63,257/- ఐదు లక్షల అరవై మూడు వేల రెండు వందల యాభై ఏడు రూపాయలు) విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో పేద ప్రజలు కూడా ధైర్యంగా కార్పొరేట్ వైద్యం చేయించుకోవచ్చునే భరోసాను కల్పిస్తున్నామన్నారు. ఆర్థిక స్థోమత లేక వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిరంతరం ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. పేదలకు నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా కూటమి పాలన సాగుతోందని, గిద్దలూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 1068 మంది లబ్ధిదారులకు ఎనిమిది కోట్ల తొంబై ఐదు లక్షల అరవై రెండు వేల ఆరు వందల తొంబై రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించటం జరిగిందన్నారు, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు. కష్టకాలంలో తమకు కొండంత అండగా నిలిచిన ముఖ్యమంత్రి కి,ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# సి ఎస్ పురంలో కార్డెన్ సెర్చ్

## లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరి -సీఐ వినోద్ కుమార్





**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 31**

వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని లైసెన్స్ తోనే వాహనాలు నడపాలని సిఐ దుర్గాసి వినోద్ కుమార్ అన్నారు మండల కేంద్రం సి.ఎస్.పురంలోని డి.జి.పేట రోడ్డులో గల రహమత్ నగర్ కాలనీలో ఆదివారం ఉదయం పోలీసులు విస్తృత స్థాయిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రకాశం జిల్లా ఎస్పీ పి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ దుర్గాసి వినోద్ కుమార్ పర్యవేక్షణలో ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు తనిఖీలు చేపట్టి 23 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటో లకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ దుర్గాసి వినోద్ కుమార్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్, గంజాయి వంటి ప్రమాదకర అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి మాత్రమే ప్రయాణించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణనష్టాన్ని తగ్గించడంలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి ఒక్కరూ భద్రతా నిబంధనలు పాటించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి హెల్మెట్ ధరించాలని, వాహనాలు నడుపుతున్న సమయంలో సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని అలాగే గ్రామాలలో అనుమానాస్పద వ్యక్తులు, నేరాలకు పాల్పడే వారిపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు ఈ సందర్భంగా వాహనదారులతో రోడ్డు భద్రత నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఎం వెంకటేశ్వర నాయక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అత్యుత్తమ మార్కులు సాధించిన కాపు విద్యార్థుల సన్మానం

### ఎమ్మెల్యే ముత్తుముల





**గిద్దలూరు పెన్ పవర్ మే 31**

గిద్దలూరు నియోజకవర్గశీలోని శ్రీ క్రిష్ణ దేవరాయ బలిజ సేవా సంఘం ఫంక్షన్ హాల్ లో 10 వ తరగతి లో 550 కి పైగా మార్కులు సాధించిన కాపు విద్యార్థిని విద్యార్థులకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి చేతుల మీదుగా , పురస్కారం ఘనంగా నిర్వహించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వీరు ఉన్నత చదువులు చదివి ఉన్నత పదవులు పొందాలన్నారు . తద్వారా సంఘసేవ చేయాలన్నారు. బలిజ సేవా సంఘం లోని సోదర సోదరీమణులందరికీ సంఘంలో కానీ స్వయంగా కానీ అభివృద్ధి కొరకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా స్వయంగా నన్ను సంప్రదించవలెనని మీకు అన్ని విధాలుగా తోడుంటానని తెలిపారు. అనంతరం కాపు సంఘం అధ్యక్షుడు, నాయకులు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కి జ్ఞాపికను బహుకరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు కాపు సంఘం అధ్యక్షుడు కమతం శ్రీనివాసులు మండల , పట్టణంలోని కాపు సంఘం నేతలు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటీరియర్ డిజైన్‌లో పట్టా తీసుకున్న దామచర్ల తనూజ లక్ష్మి



**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం మే 31**

ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు చిన్న కుమార్తె దామచర్ల తనూజ లక్ష్మి అమెరికా లోని ప్రముఖ విశ్వవిద్యాలయం లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఇంటీరియర్ డిజైన్‌లో మ్యాగ్నా కమ్ లాడ్ గౌరవాలతో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ డిగ్రీని పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రాడ్యుయేషన్ ఫంక్షన్ లో పట్టా తీసుకున్న నేపథ్యంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు, దామచర్ల నాగ సత్యలత, దామచర్ల అనిషా లక్ష్మి అభినందనలు తెలిపారు.

# శాస్త్రీయ సమాజ నిర్మాణానికి జన విజ్ఞాన వేదికలో చేరాలి



**మార్కాపురం పెన్ పవర్ మే 31**

శాస్త్రీయ దృక్పథంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జన విజ్ఞాన వేదికలో భాగస్వామ్యులు కండి అనే వాల్ పోస్టర్‌ను ఆదివారం పట్టణంలోని శ్రీ విద్య కోచింగ్ సెంటర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు యు. వెంకట్రావు మాట్లాడుతూ సమాజంలో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడం అత్యవసరమని పేర్కొన్నారు. మూఢనమ్మకాల నివారణకు, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి వేదిక కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఏనుగుల రవికుమార్, పట్టణ కార్యదర్శి ఓ. రామాంజనేయులు, పర్యావరణ కన్వీనర్ సిహెచ్. శ్రీధర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణస్వామి సన్నిధిలో ఎంపీడీవో వి ప్రతాపరెడ్డి



సి ఎస్ పురం, పెన్ పవర్ మే 31

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానాన్ని ఆదివారం ఎంపీడీవో వి. ప్రతాపరెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామివారి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎంపీడీవో దంపతులకు గోత్రనామాలతో వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం దేవస్థానం తరపున శేషవస్త్రాలతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ విశిష్టత, పూజా కార్యక్రమాల గురించి అర్చకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాలలో నీటి సంఘం అధ్యక్షులు దొనపాటి మోహన్ రెడ్డి, తీకెనం బాబురావు, కొమ్మినేని వెంకట్రావు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# నీతి నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వహించే వారికి సమాజంలో గుర్తింపు లభిస్తుంది





**కొమరోలు పెన్ పవర్ మే 31**

ఉద్యోగం ఏదైనా నీతి నిజాయితీతో, అంకిత భావంతో విధులు నిర్వహించే వారికి సమాజంతో పాటు ప్రభుత్వ పరంగా కూడా మంచి గుర్తింపు లభిస్తుందని సన్మాన గ్రహీత, కొమరోలు మండల విద్యాశాఖ అధికారి 2 బొర్రా వెంకటరత్నం పేర్కొన్నారు. కొమరోలు మండల విద్యాశాఖ అధికారి 2 గా పనిచేస్తున్న బొర్రా వెంకటరత్నం స్కూల్ అసిస్టెంట్ గా, ప్రధానోపాధ్యాయంగా, మండల విద్యాశాఖ అధికారిగా 31 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకుని మేనెల 31వ తేదీ ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని కొమరోలు లోని మండల విద్యా వనరుల కేంద్రంలో విద్యా వనరులకు కేంద్ర కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు ఆదివారం వెంకటరత్నంకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి 1 వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా ,సన్మాన గ్రహీత బొర్రా వెంకటరత్నం, కొమరోలు ప్రభుత్వ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శివ నాగేశ్వరరావు, కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు అబ్బూరి అల్లూరయ్య, బొడ్డువాని పల్లె జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా సన్మాన గ్రహీత వెంకటరత్నం మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగం ఏదైనా ఉద్యోగి అంకితభావంతో, నీతి నిజాయితీతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ వృత్తిని దైవంగా భావిస్తూ విధులు నిర్వహించగలిగితే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని, అంతేకాక ప్రభుత్వపరంగా గుర్తింపు, అవార్డులు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. విద్యా శాఖలో విధులు నిర్వహించడం అదృష్టమని, అందులోనూ ఉపాధ్యాయ వృత్తి లభించటం పూర్వజన్మ సుకృతమని వివరించారు. ఉపాధ్యాయులు తమకు లభించిన సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి వారికి మంచి భవిష్యత్తు కలిగే విధంగా వారిని తీర్చిదిద్దాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్ గా, ప్రధానోపాధ్యాయునిగా, మండల విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహించే అవకాశం తనకు లభించడం తన అదృష్టంగా ఆయన అభివర్ణించారు. తాను ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుకున్న అల్లినగరంలోని జిల్లా పరిషత్ హై స్కూలు లో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసే అవకాశం లభించడం తనకు మరింత గర్వంగా ఉన్నదని, తాను ఉపాధ్యాయునిగా పనిచేసినా, హెడ్మాస్టర్ గా పని చేసినా, మండల విద్యాశాఖ అధికారి పనిచేసినా, వృత్తులను దైవంగా భావిస్తూ, నీతి నిజాయితీతో పనిచేస్తూ ఆ వృత్తులకు న్యాయం చేశానని అంటూ నీతి నిజాయితీ, అంకిత భావం, వృత్తిని దైవంగా భావించడం వల్లనే తాను మంచి గుర్తింపు పొంది అందరి ఆదరాభిమానాలతో సంతోషంగా పదవి విరమణ చేస్తున్నానని వెంకటరత్నం పేర్కొన్నారు. అధికారిగా పనిచేస్తున్నప్పటికీ తాను ఎప్పుడు కూడా అవినీతికి పాల్పడలేదని, కార్యాలయ సిబ్బందిని , పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను గౌరవిస్తూ వారితో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను విజయవంతం చేశానని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వెంకటరత్నం స్కూల్ అసిస్టెంట్ గా, ప్రధానోపాధ్యాయునిగా, మండల విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహించి అంకితభావంతో కృషిచేసి విద్యా శాఖకు వన్నెతెచ్చారని, ఆయన పాఠశాలలను పర్యవేక్షిస్తూ , పాఠశాలల అభివృద్ధికి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయులు కూడా వెంకటరత్నం ను ఆదర్శంగా తీసుకొని వృత్తిని దైవంగా భావిస్తూ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి పాటు పడాలని కోరారు. ఆ కార్యక్రమంలో కొమరోలు ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శివనాగేశ్వరరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాధ్యాపకులు అబ్బూరి అల్లూరయ్య, బొడ్డువానిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన బాదినేని పల్లె మండల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎస్టియు నాయకులు పులిగోటి సుబ్బరాయుడు తోపాటు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు,, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ,ఎంఆర్సి కార్యాలయ సిబ్బంది సన్మాన గ్రహీత వెంకటరత్నం సేవలను కొనియాడుతూ ఉపన్యసించారు. అనంతరం బొర్రా వెంకటరత్నం ను ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఎం ఆర్ సి కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శాలువా, పూలమాల, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఆ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ పసుపులేటి వెంకటేశ్వర్లు ,ఎంట్రీ డేటా ఆపరేటర్ రవీంద్రారెడ్డి ,సి ఆర్ పి లు రామాంజి ,పుల్లయ్య, ఆదినారాయణ, ఆంజనేయులు ,,ఐఈఆర్టి లు శ్రీనివాసరెడ్డి ,సరస్వతి తోపాటు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు. తన ఉద్యోగ విరమణ సందర్భాన్ని పురస్కరించుకొని తనను ఘనంగా సన్మానించిన వారందరికీ వెంకటరత్నం పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# జన సురక్ష ట్రస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీమంత్రి బాలినేని




**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 31**

సామాజిక సేవా కార్యక్రమాలద్వారా ప్రజలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన జన సురక్ష ట్రస్ట్ – కనిగిరి" పోస్టర్ ను ఆదివారం ఒంగోలులోని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. కనిగిరి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు మాదాసు రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, జనసేన పార్టీ నాయకులు బాలినేని శ్రీనివాసులురెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవే పరమావధిగా భావించి పనిచేస్తున్న యువ నాయకులు, సేవా సంస్థలను ప్రోత్సహించడం సంతోషకరమని అన్నారు. సమాజంలో ఆపదలో ఉన్నవారికి చేయూతనందించే సేవా కార్యక్రమాలు మరింత విస్తృత స్థాయిలో కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలిచే సంస్థలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జనసేన పార్టీ నాయకులు మాదాసు రమేష్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో, బాలినేని శ్రీనివాసులురెడ్డి ఆశీస్సులతో "జన సురక్ష ట్రస్ట్"ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు, జనసైనికులకు అవసరమైన సమయంలో సహాయం అందించడం, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని వివరించారు. ప్రజా సంక్షేమం, సేవా కార్యక్రమాలకు వేదికగా జన సురక్ష ట్రస్ట్ పనిచేయాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గొర్రెపాటి శ్రీను, రాయపాటి అరుణ, మలగా రమేష్, నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు , వీర మహిళలు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమం

**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 31**

ఎండాకాలం సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా మండల కేంద్రం సి.ఎస్.పురం నందు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులను ఆకట్టుకుంటోంది. ప్రభుత్వ గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కర్ రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఆదివారం "చదవడం మాకిష్టం" కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థినీ, విద్యార్థులకు నీతి కథలు, సంగీతం, పాటలు, నృత్యాలు, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్, లెక్కలు, ఆటలు తదితర అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. దీంతో పిల్లలు వినోదంతో పాటు విజ్ఞానాన్ని కూడా పెంపొందించుకుంటూ తమ సెలవులను సద్వినియోగం చేసుకుంటున్నారు ఈ సందర్భంగా రాగసాని రమణయ్య కుమారుడి పుట్టినరోజు వేడుకలను శిబిరంలో నిర్వహించి, విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. పిల్లలు ఆనందంగా పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు ఆళ్ల భాస్కర్ రావు, రిటైర్డ్ ఉద్యోగి పి.రంగస్వామి, రమణయ్య, బోధన



సిబ్బంది ఆయేషా, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి వాయు లింగంను దర్శించుకున్న దారపనేని, బైరెడ్డి





**పామూరు, పెన్ పవర్ ,మే31.**

శ్రీకాళహస్తి లో రాహు, కేతు పూజలో పాల్గొన్న బైరెడ్డి, దారపనేని పంచభూత లింగాలలో ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి వాయు లింగం ను ఆదివారము కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థానంలో రాహు, కేతు పూజ అనంతరము జ్ఞాన ప్రసునాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం ప్రధాన అర్చకులు స్వామి వారి పట్టు వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. దారపనేని రాజేంద్రప్రసాద్, మిరియం సుబ్బరాయుడు, కౌలూరి ఖాజా రంతుల్లా, జాజం హరికృష్ణ పూజలో పాల్గొన్నారు.

# టెన్త్ పరీక్షలలో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం అభినందనలు

### స్కూల్ ఫస్ట్ గా నిలిచిన షేక్ మునాఫ్, ఫర్జానా.

### కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సౌజన్యంతోఘనంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమాలు.






**కొమరోలు పెన్ పవర్ మే 31**

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో 500 లకు పైగా మార్కులు సాధించి కొమరోలు ప్రభుత్వ హైస్కూల్ కు మంచి పేరు ప్రఖ్యాతలు సాధించిపెట్టిన 23 మంది విద్యార్థులను ఆదివారం పూర్వ విద్యార్థుల సౌజన్యంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. గత మార్చిలో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్ నుంచి 97 మంది విద్యార్థులు హాజరయ్యారు పరీక్షా ఫలితాల లో 97 మందిలో 90 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై పాఠశాలకు 93% ఉత్త శాతాన్ని సాధించి పెట్టారు కాగా ఉత్తీర్ణులైన వారిలో 23 మందికి 500 లకు పైగా మార్కులు వచ్చాయి. దీనితోఈ ఏడాది ఆ పాఠశాల రికార్డు సృష్టించి ప్రత్యేకతను చాటుకున్నది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆ పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 500కు పైగా మార్పు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను శాలువా జ్ఞాపకాలతో సర్టిఫికెట్లతో ఘనంగా సన్మానించారు 1983 84 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థుల సౌజన్యంతో సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆ కార్యక్రమానికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా కొమరోలు విద్యాశాఖ అధికారులు వెంకటేశ్వర్లు బొర్ర వెంకటరత్నం, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్ఎం సుభాని వివిధ హోదాలో ఉన్న పూర్వ విద్యార్థులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శివనాగేశ్వరరావు మాట్లాడుతూ ఏడాది తమ పాఠశాల పదవ తరగతి విద్యార్థులు పాఠశాలకు 93% ఉత్తీర్ణతా శాతం సాధించే ప్రథమే కాకుండా, 23 మంది విద్యార్థులు 500 లకు పైగా మార్పులు సాధించి పాఠశాలకు మంచి గుర్తింపు పేరు ప్రత్యర్థులు సాధించి పెట్టారని పేర్కొన్నారు. ఇలాంటి అత్యుత్తమ ఫలితాలు రావడం పాఠశాల చరిత్రలో ఇదే ప్రథమం కావడం ఒక ప్రత్యేకత అని ఆయన పేర్కొంటూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను అభినందించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్ఎం సుభాని మాట్లాడుతూ పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో కూడా అదే స్ఫూర్తితో గొప్ప చదువులు చదువుతూ మంచి మార్కులు సాధిస్తూ, మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని , తద్వారా చదువుకున్న పాఠశాలకు, కొమరోలు పట్టణానికి, మండలానికి మంచి పేరు ప్రఖ్యా సంధించి పెట్టాలని కోరారు. ఆ కార్యక్రమంలో83- 84 బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులు పోస్ట్ శాఖలు పనిచేస్తున్న శ్రీనివాసులు, కనిగిరి ఎంపీడీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గా పని చేస్తున్న సుధాకర్ రెడ్డి, తదితరులు విద్యార్థులను అభినందిస్తూ వారు భవిష్యత్తులో గొప్ప చదువులు చదువుతూ గొప్ప ఉద్యోగాలు సాధించి స్థిరపడాలని ఆకాంక్షించారు. అదే పాఠశాలలో సదరం సర్టిఫికెట్ తో పదో తరగతి చదువుతూ, టెన్త్ పరీక్షలలో విద్యాశాఖ కల్పించిన తెలుగు ఇంగ్లీష్ సబ్జెక్టుల మినహాయింపు తో మిగిలిన నాలుగు సబ్జెక్టుల పరీక్షలు రాసిన షేక్ మునాఫ్ 400 మార్కులకు 382 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు సాధించి పెట్టాడు. అదే పాఠశాలలు చెందిన షేక్ ఫర్జానా అనే విద్యార్థిని 600 మార్కులకు 556 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి పాఠశాలకు మంచి గుర్తింపు సాధించి పెట్టింది. వారిద్దరితో పాటు 500లకు పైగా మార్కులు సాధించిన మిగిలిన 21 మంది విద్యార్థులను వారి తల్లిదండ్రులను పూర్వ విద్యార్థులు జ్ఞాపికలతో సర్టిఫికెట్లతో ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమానికి ఆర్థికంగా సహకరించడమే కాకుండా దూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలను భరిస్తూ, స్వయంగా కార్యక్రమానికి హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయుటకు సహకరించిన 1983- 84 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదర్శప్రాయులని అంటూ వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివనాగేశ్వరరావు , పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్ఎం సుభాని,ఆ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు, కార్యక్రమాలు విజయవంతమవుటకు బాధ్యత వహించిన విశ్వరూప చారి, పలువురు ఉపాధ్యాయులు ముఖ్య అతిథులు అభినందించారు. తాము అత్యధిక మార్కులు సాధించుటకు తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉన్నదని, వారితోపాటు తమ తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా ఎంతో ఉన్నదని, అందువల్ల ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పాఠశాలకు జీవితాంతం రుణపడి ఉంటామని , సన్మానాలు పొందిన విద్యార్థులు భావోద్వేగంతో వెల్లడించారు.

# మద్దులేటికి ఎమ్మెల్యే అశోక్ రెడ్డి సన్మానం

### మై టీడీపీ యాప్‌లో నంబర్ 1



**గిద్దలూరు పెన్ పవర్ మే 31**

తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు రూపొందించిన 'మై టీడీపీ' యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, గిద్దలూరు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న గిద్దలూరు మద్దులేటిని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఘనంగా సత్కరించారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై యాక్టివ్‌గా ఉంటూ నియోజకవర్గంలోనే అగ్రస్థానంలో నిలిచినందుకు గాను మద్దులేటిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా మద్దులేటికి , మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రమశిక్షణ, నిరంతర శ్రమతో పనిచేసే కార్యకర్తలకు పార్టీలో ఎల్లప్పుడూ సముచిత స్థానం, గుర్తింపు ఉంటాయని పేర్కొన్నారు. మద్దులేటి లాంటి చురుకైన కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని కొనియాడారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి చేతుల మీదుగా ఈ సత్కారం అందుకోవడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని, ఇది చాలా సంతోషాన్ని ఇచ్చిందని మద్దిలేటి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యలపై పోరాటాలకు తన కృషిని మరింత ఉత్సాహంతో కొనసాగిస్తానని గిద్దలూరు మద్దులేటి స్పష్టం చేశారు.

# పోకూరులో చెరువును తలపిస్తున్న సిమెంట్ రోడ్డు

**వలేటివారిపాలెం, పెన్ పవర్ మే31**

పోకూరు గ్రామం నుంచి సింగమనేని పల్లి, నలదలపూరు, కొండారెడ్డి పాలెం వాసులు ప్రతినిత్యం తిరిగే రోడ్డు కొద్దిపాటి వర్షానికే నీరు నిల్వ చేరి చెరువును తలపిస్తోంది. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి పోకూరు గ్రామంలోని మాధవ స్వామి టెంపుల్, సెర్ప్ సెంటర్ గ్రామంలో ప్రధాన వీధుల్లో వర్షపు నీరు రోడ్డుపై చేరి చెరువును తలపిస్తుంది. మాధవ స్వామి టెంపుల్ వద్ద రోడ్డుపై నీరు బయటకు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో రోడ్డుపై నీరు నిలవడంతో సింగమనేని పల్లి, నలదలపూరు కొండారెడ్డి పాలెం వైపు వెళ్లే ప్రజలు తమ వివాహనాల్లోకి నీరు వెళ్లి వాహనా దారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్య వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు మీదుగా ప్రతినిత్యం వందలాది వాహనాలు, ప్రజలు ఈ రోడ్డుపైనే ప్రయాణం చేస్తుంటారు. పోకూరు లో ఈ సమస్య పరిష్కారానికి రోడ్డు పక్కన డ్రైనేజీ కాలువ బ్లాక్ చేయడం వల్లే సమస్య తలెత్తుతుందని చెబుతున్నారు. అంతే కాకుండా గ్రామంలో ఇంకా చాలా మురుగు కాల్వలు ఉపయోగం లోకి తీసుకురాలేదు. కొన్ని చోట్ల సిమెంట్ రోడ్డు పాతది కావడం, కాలువ కంటే రోడ్డు తక్కువ పల్లంలో ఉండడంతో నీరు అక్కడే నిల్వ ఉంటుందని చెబుతున్నారు. పంచాయతీ సిబ్బంది, అధికారులు జోక్యం చేసుకొని సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.





# అంకిత భావంతో విధులు నిర్వహిస్తే సమాజంలో గొప్పగుర్తింపు





**గిద్దలూరు పెన్ పవర్ మే 31**

ఏ ఉద్యోగి అయినా అంకిత భావంతో పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు , సన్మానాలు వాటంతట అవే మన దరికి చేరువ అవుతాయని ఆకోవకు చెందిన అధికారిగా గిద్దలూరు ఏ బిసి డబ్ల్యూఓ దమ్మాల హరిప్రసాద్ ఉంటాడని జిల్లా బిసి సంక్షేమాధికారి నిర్మలా జ్యోతి పేర్కొన్నారు. గిద్దలూరు ఎబిసి డబ్ల్యూ ఓ గాపనిచేస్తూ ఆదివారం పదవి విరమణ చేసిన దమ్మాల హరిప్రసాద్ కు స్థానిక బిసి బాలికల హాస్టల్లో వీడ్కోలు సన్మానసభ నిర్వహించారు. ఈ సన్మానాసభలో జిల్లా డిబిసి డబ్ల్యూ ఓ నిర్మలా జ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గిద్దలూరు సబ్ డివిజన్ లో బిసి సహాయ సంక్షేమాధికారిగా పనిచేస్తూ నేడు పదవి విరమణ చేస్తున్న హరిప్రసాద్ , సబ్ డివిజన్లలో వసతిగృహ సంక్షేమాధికారులు సమన్వయం చేసుకుంటూ వసతి గృహాల పనితీరును మెరుగుపర్చారని, కాకుండా జిల్లా నుండి ఏ నివేదికలు కోరినా క్షణాల్లో అందించి జిల్లా అధికారులకు ఏంతో సహకరించారని తెలిపారు. కాకుండా స్థానిక సిబ్బంది కి శాఖ పరమైన సమస్యలను తదృష్టికి తీసుకోచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేశారని. నాల్గవ తరగతి సిబ్బంది సమస్యల ను పరిష్కరించారన్నారు. ప్రతి సమస్యను జిల్లా అధికారి దృష్టికి తీసుకొచ్చి ఆ సమస్య పరిస్కారానికి కృషిచేశారని తెలిపారు, జిల్లా అధికారులకు ఇంత సహకరించిన అధికారి మరొకరు లేరన్నారు హరిప్రసాద్ అందరికి ఆదర్శప్రాయుదన్నారు. హాస్టల్ సంక్షేమాధికారిగా బాధ్యతల చేపట్టి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేసి ఆ వస్థీగృహాల అభివృద్ధి కి , పిల్లల భవిష్యత్ కు సంక్షేమానికి కృషిచేసి నూతన ఒరవడి తీసుకొచ్చారని , అదే శాఖలో పదోన్నతి పొంది అదే పనితీరునుకొనసాగించి ఆదర్శనంగా నిలిచారన్నారు. హరిప్రసాద్ అందరికి ఆదర్శం అన్నారు. ఈ సన్మానాసభకు మార్కాపురం ఎబిసిడబ్ల్యూ ఓ ఖాసీం అధ్యక్షత వహించగా , కంభం గ్రేడ్ 1 వసతిగృహ సంక్షేమాధికారి సోమ్లీ బాయి,విశ్రాంత ఎబిసిడ బ్ల్యూఓ సూరె సుబ్రహ్మణ్యం, విశ్రాంత ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు గొటికె రవీంద్రనాథ రెడ్డి, వసతిగృహ సంక్షేమాధికారులు, హాస్టళ్ళ నాలగవ తరగతి సిబ్బంది తదితరులు హరిప్రసాద్ సేవలను కొనియాడారు. హరిప్రసాద్, సుభాషిణి దంపతులను ఘనంగా సన్మానించారు.

# నారాయణ స్వామికి శాస్త్రోక్తంగా విశేష పూజలు





**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 31**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు, వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ శాస్త్రోక్తంగా అభిషేక పూజలు నిర్వహించారు అనంతరం స్వామివారి మూలవిరాట్, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు భక్తి సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించిన గోపూజ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ ఆవరణలోని గోశాలలో గోవును అలంకరించి మేళతాళాల నడుమ వేదమంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా గోపూజ నిర్వహించారు. గోమాతను లక్ష్మీ స్వరూపిణిగా భావిస్తూ భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.తదుపరి స్వామివారికి సమర్పించనున్న మహా నైవేద్యాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణలుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం అర్చకులు గోత్రనామాలతో మంత్రోచ్చారణలతో భక్తులకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమాలలో ఎంపీడీవో వి ప్రతాపరెడ్డి దంపతులు, నీటి సంఘం అధ్యక్షులు దొనపాటి మోహన్ రెడ్డి, కొమ్మినేని వెంకట్రావు, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# కొమరోలు ప్రభుత్వ హైస్కూల్ కు మంచి గుర్తింపు సాధించి పెట్టిన విద్యార్థుల కృషి మరువరానిది



**కొమరోలు పెన్ పవర్ మే 31.**

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో 500 లకు పైగా మార్కులు సాధించి పాఠశాలకు మంచి గుర్తింపు, పేరు ప్రఖ్యాతులు సాధించి పెట్టిన 23 మంది విద్యార్థుల కృషి మరువరానిదని కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివనాగేశ్వరరావు ,పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్ఎం సుభాని, ఆ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు విశ్వరూప చారి , 1983 -84 బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులు పేర్కొంటూ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. గత మార్చిలో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు కొమరోలు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 97 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిలో 90 మంది విద్యార్థులుఉత్తీర్ణులైన పాఠశాలకు 93 శాతం ఉత్తీర్ణత శాతాన్ని సాధించి పెట్టారు. ఉత్తీర్ణులైన వారిలో షేక్ మునాఫ్ (సదరం సర్టిఫికెట్ గ్రహీత) 400 మార్కులకు 382 మార్కులు సాధించాడు, షేక్ ఫర్జానా 600 మార్కులకు 556 మార్కులు, సాధించి పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో, మండల స్థాయిలో మంచి ర్యాంకు సాధించింది. ఇక పల్లె పల్లవి 550 మార్కులు, దూదేకుల రజియా 548మార్కులు, పులి నేహా 548 మార్కులు, పొన్న దేవి ప్రియ 544 మార్కులు, ఇర్రి అరుణ్ కుమార్ 543 మార్కులు, కుమ్మర్ల మహేష్ 541 మార్కులు, గౌరీ హర్షిత్ 537 మార్కులు, ఒడితే రక్షిత భాయి 536 మార్కులు, షేక్ ఆఫ్రిన్ 536 మార్కులు, బండెల కళ్యాణి 532 మార్కులు, ఇసుకల అక్షయ 529 మార్కులు, కోనేటి కార్తీక్ 529 మార్కులు, బేతంచెర్ల నాగూర్ భాష 526 మార్కులు, సత్తెనపల్లి చందన 522 మార్కులు, కొర్రపాటి సంజన 521 మార్కులు, సత్యేలి కావ్య521 మార్కులు, కొమరోలు రంగ శైలజ 519 మార్కులు, దూదేకుల మమతాజ్ 509 మార్కులు, పోలెపోయిన వెంకట జయరాం 508 మార్కులు, కత్తుల రమ్యశ్రీ 507 మార్కులు, పంకు భాగ్య502 మార్కులు సాధించారని పేర్కొంటూ సదరు 23 మంది విద్యార్థులను వారితో పాటు 1983 84 బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులను పేరుపేరునా అభినందించి, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆదివారం ఆ పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శాలువా జ్ఞాపకాలు సర్టిఫికెట్లతో ఘనంగా సన్మానించారు.

# ముగిసిన అథ్లెటిక్స్ వేసవి శిక్షణ శిబిరం




**టెక్కలి, పెన్ పవర్ మే 31** : టెక్కలి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం లో శాప్ ఆధ్వర్యంలో గత 31 రోజులుగా జరిగిన అథ్లెటిక్స్ వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ శిబిరంలో క్రీడాకారులు అనేకమైన టెక్నిక్స్, స్కిల్స్, ఫిజికల్ ఫిట్నెస్, మెరిట్ ఏసియన్, మరెన్నో వేసవి శిక్షణ శిబిరంలో నేర్పించారు. అలాగే ఈ నెల రోజులు శిక్షణ శిబిరంలో రన్స్ , త్రోస్,జంప్స్,ఈవెంట్స్ లో స్కిల్స్ కూడా నేర్పించారు. అథ్లెటిక్స్ ఇన్చార్జ్ కాపల రఘునాథరావు ఆధ్వర్యంలో ఈ వేసవి శిక్షణ శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో కే.కే.రామిరెడ్డి, నారాయణరావు,లక్ష్మణ్ రాజా, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


# సంతబొమ్మాళి గ్రంథాలయంలో స్లో సైక్లింగ్ పోటీలు



**టెక్కలి, పెన్ పవర్ మే 31** : సంతబొమ్మాళి మండల కేంద్రం లోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇండోర్ గేమ్స్ స్లో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా విభజించి విద్యార్థిని విద్యార్థులకు స్లో సైక్లింగ్ పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారి ఎస్ ఉదయ్ కిరణ్ తెలిపారు. ఈ పోటీల్లో 24 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కూర్మా రావు సేవలు స్ఫూర్తిదాయకమైనవి.

- పదవీ విరమణ కార్యక్రమంలో ఘన సన్మానంలో వక్తలు.




**చింతపల్లి పెన్ పవర్ మే 31.** ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జే కూర్మారావు సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గా 42 సంవత్సరాల సుదీర్ఘమైన సేవలను అందించి ఆదివారం ఆయన పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 42 సంవత్సరాల సుదీర్ఘమైన గౌరవప్రదమైన సేవలను అందించారన్నారు. 07.07.1983 లో ఉద్యోగంలో చేరిన ఆయన తన సేవా కాలంలో నిబద్ధత నిజాయితీ మరియు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి ఎక్సైజ్ శాఖకు ఎనలేని సేవలు అందించడంతోపాటు విశిష్ట గుర్తింపును తీసుకువచ్చారన్నారు. విధులలో భాగంగా నాటు సారాయి నిర్మూలన అక్రమ మద్యం అరికట్టడంలో కీలకపాత్ర పోషించి ఎంతో మంది యువ అధికారులకు ఆదర్శంగా నిలిచారన్నారు. కూర్మారావు అందించిన సేవలు శాఖకు సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉంటాయని వారు కొనియాడారు. ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో విశ్రాంత శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని వారు ఆకాంక్షించారు. అనంతరం దుస్సాలువ కప్పి పుష్పగుచ్ఛంతో ఘనంగా ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ అవగాహన సదస్సును విజయవంతం చేద్దాం

- జీకే వీధి వైసీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్ పిలుపు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 31:** పాడేరు శాసన సభ్యులు, అల్లూరి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆధ్వర్యంలో నిర్వహించనున్న బూత్ స్థాయి ఏజెంట్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అవగాహన సదస్సును విజయవంతం చేయాలని జీకే వీధి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్ పిలుపునిచ్చారు.జూన్ 2వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు పాడేరు కేంద్రంలోని "కాఫీ హౌస్"లో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ ముఖ్య నాయకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.గూడెం కొత్తవీధి మండల పరిధిలోని 56 మంది బూత్ స్థాయి ఏజెంట్లు, పంచాయితీ పార్టీ అధ్యక్షులు, ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండల పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ అనుబంధ విభాగాల రాష్ట్ర, జిల్లా, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ఆదివాసీ ప్రాంతాలకు 16వ ఆర్థిక సంఘం నిధులు అధికంగా కేటాయించాలి

**జీకే వీధి టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు విజ్ఞప్తి**

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 31:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 16వ ఆర్థిక సంఘం ద్వారా భారీగా నిధులు కేటాయించడం శుభపరిణామమని జీకే వీధి టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు అన్నారు. 2030-31 వరకు ఐదేళ్ల కాలానికి రూ.4,35,236 కోట్ల గ్రాంట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ సిఫార్సు చేయడం గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల అభివృద్ధికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు రూ.16,627 కోట్లు, తెలంగాణకు రూ.9,968 కోట్లు కేటాయించారని తెలిపారు.అయితే మారుమూల ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని అరకు, పాడేరు నియోజకవర్గాల మండలాలకు అధికంగా ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లను విజ్ఞప్తి చేశారు. జీకే వీధి మండలంలో ఇప్పటికీ అనేక గ్రామాలకు సరైన రహదారి సదుపాయాలు లేక గిరిజనులు వాగులు, వంకలు దాటి వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి ఉందన్నారు. గర్భిణీలు డోలీల ద్వారా ఆస్పత్రులకు తరలించే పరిస్థితులు కొనసాగుతున్నాయని, అత్యవసర వైద్య సేవలు అందక ప్రాణనష్టం సంభవిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అంబులెన్స్, ఆటో, కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని గ్రామాలు ఇంకా ఉన్నాయని తెలిపారు.చాలా పంచాయతీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు, విద్య, వైద్యం వంటి మౌళిక వసతులు లేక గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. చదువుకున్న గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందన్నారు. జీవో నంబర్-3 పునరుద్ధరించాలని కూడా ప్రభుత్వాన్ని కోరారు.ఇటీవల జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికగా తారు రోడ్లు, సీసీ రోడ్లు, తాగునీరు, సాగునీటి చెక్‌డ్యామ్‌లు, పాఠశాల భవనాలు, జల జీవన్ మిషన్ బోర్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి సంబంధించి పలు తీర్మానాలు అధికారులకు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి మౌళిక వసతులు కల్పించాలని పొత్తూరు కొండలరావు విజ్ఞప్తి చేశారు.



# ఉత్తరాంధ్ర చిరకాల స్వప్నం సాకారం.. దక్షిణ రైల్వే జోన్ ప్రారంభం



**టెక్కలి, పెన్ పవర్ మే 31** : ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల ఆకాంక్ష, మూడు తరాల పోరాటాల ఫలితంగా విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ రేపటి నుంచి అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించనుండటం చారిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మేరకు కోటబొమ్మాళి మండలం నిమ్మాడ క్యాంపు కార్యాలయం నుండి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది కేవలం పరిపాలనా నిర్ణయం మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో సువర్ణ అధ్యాయానికి నాంది పలికే మైలురాయని ఆయన అభివర్ణించారు. దీర్ఘకాలంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు చేసిన నిరంతర ఉద్యమాలకు ఇది విజయ చిహ్నమని మంత్రి తెలిపారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని 'డబుల్ ఇంజన్ సర్కార్' కృషి వల్లే ఈ మహత్తర లక్ష్యం సాకారమైందన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో రైల్వే జోన్ అంశాన్ని చేర్చేందుకు కృషి చేసిన తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీల పాత్రను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

**ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధికి కొత్త దిశ**

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో పరిపాలనా వికేంద్రీకరణకు బలమైన పునాది పడటమే కాకుండా, రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణ, కొత్త ప్రాజెక్టుల అమలు, సరకు రవాణా సామర్థ్యాల పెంపు, పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణకు విస్తృత అవకాశాలు ఏర్పడనున్నాయని మంత్రి వివరించారు. విశాఖపట్నం దేశంలోని ప్రముఖ రవాణా, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దే ప్రక్రియలో ఈ జోన్ కీలక పాత్ర పోషించనుందని ఆయన పేర్కొన్నారు. స్థానిక యువతకు మరింత ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో విశాఖపట్నంలో ప్రత్యేక రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో విశాఖ కేంద్రంగా బుల్లెట్ రైలు ప్రాజెక్టు రూపుదిద్దుకునే అవకాశాలపై కేంద్ర రైల్వే శాఖ చేసిన ప్రకటన ఉత్తరాంధ్ర ప్రజల్లో కొత్త ఆశలను నింపిందన్నారు.

**ఎర్రన్నాయుడు కలకు నేడు రూపం**

దక్షిణ కోస్తా రైల్వే జోన్ సాధన వెనుక దివంగత మహానేత కింజరాపు ఎర్రన్నాయుడు చేసిన పోరాటం చిరస్మరణీయమని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు కోసం పార్లమెంట్‌లో పలుమార్లు గళమెత్తిన ఎర్రన్నాయుడు, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది అత్యవసరమని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. రైల్వే మౌలిక వసతుల విస్తరణ, కొత్త రైళ్ల మంజూరు, ఉపాధి అవకాశాల పెంపు కోసం ఆయన చేసిన కృషి ఉత్తరాంధ్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షను జాతీయ స్థాయిలో ప్రతిధ్వనింపజేసిన ఎర్రన్నాయుడు కల నేడు సాకారం కావడం గర్వకారణమని మంత్రి తెలిపారు.

**తెలుగు ప్రజల తరఫున కృతజ్ఞతలు**

ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరికను నెరవేర్చి దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు కార్యరూపం దాల్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లకు తెలుగు ప్రజల తరఫున మంత్రి అచ్చెన్నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభం ఉత్తరాంధ్ర అభివృద్ధికి నూతన యుగానికి నాంది. ఇది ప్రాంతీయ ఆకాంక్షల విజయమే కాకుండా, సమగ్ర అభివృద్ధి దిశగా భారత రైల్వే చరిత్రలో నిలిచిపోయే ఘట్టం" అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# బరెంగుల మినీ అంగన్వాడి పోస్ట్ గ్రామ మహిళకే కేటాయించాలి

- వేరే గ్రామాల వారికి నియమిస్తున్న అంగన్వాడి సూపర్వైజర్ పై చర్యలకు డిమాండ్.
- గిరిజన సంఘం నాయకులు గల్లెల జీనబంధు, నారాయణ, సీతారాం.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 31.** మండలంలో గల కరీముఖిపుట్టు పంచాయతీ బరెంగుల గ్రామంలో మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టు గ్రామ మహిళలకు కేటాయించాలని గిరిజన సంఘం నాయకులు గల్లెల జీనబందు, నారాయణ, సీతారాం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ.. బరెంగుల గ్రామంలో అంగన్వాడి కేంద్రం లేకపోవడం వలన గ్రామంలో గల బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బరెంగుల మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టును ఇతర గ్రామాలకు చెందిన వారికి కేటాయించడం సరికాదని, గ్రామంలో అర్హత ఉన్న మహిళలు ఉన్నారన్నారు. బరెంగుల గ్రామంలో గత 2004 సంవత్సరం నుండి నేటి వరకు అంగన్వాడి కార్యకర్త భర్తీ కొరకు సంబంధిత అధికారులకు వినతి పత్రాలు సమర్పించిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. మినీ అంగన్వాడీ కార్యకర్త భర్తీకి ఖాళీ చూపించకుండానే సంబంధిత అంగన్వాడి సూపర్వైజర్ బరెంగుల గ్రామంలో పోస్ట్ భర్తీ అయ్యిందని చెప్పడం విడ్డూరంగా ఉందని గిరిజన సంఘం నాయకులు మండిపడ్డారు. గ్రామంలో ప్రత్యేక అధికారులు పర్యటించి గ్రామ ప్రజలకు న్యాయం చేయాలనీ, గ్రామస్తులు అనుమతి లేకుండా వేరే గ్రామాల వాళ్లకి ఎలా నియమించారని, నియమించిన సూపర్వైజర్ పై తగు చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వి రాజు, వి గోపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**టెక్కలి, పెన్ పవర్ మే 31** : సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రామానికి చెందిన దారపు రాజు (27) అనే యువకుడు ఆదివారం విద్యుత్ స్తంభాన్ని ద్విచక్ర వాహనంతో ఢీకొని మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రామానికి చెందిన దారపు రాజుకి కోటబొమ్మాళి గ్రామానికి చెందిన దీపికతో మే 10న వివాహం జరిగింది. కోటబొమ్మాళి లోని తన అత్తవారింటికి ద్విచక్ర వాహనంపై భార్య దీపికతో కలిసి ఆదివారం వెళ్లారు. తిరిగి స్వగ్రామం మూలపేటకి బయలుదేరు వస్తుండగా సవరపేట జంక్షన్ వద్ద విద్యుత్ స్తంభానికి ఢీకొని రాజు మృతి చెందాడు. కోటబొమ్మాళి ప్రభుత్వాసుపత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ ధృవీకరించారు. కాళ్లకు పారాణి ఆరకముందే భర్త మరణ వార్త విని, తనకు దిక్కెవరిని భార్య దీపిక కన్నీరు మున్నీరుగా విలపించింది. దీంతో ఇరు కుటుంబాల్లో, మూలపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శవాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులు అప్పగించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సంతబొమ్మాళి ఎస్సై వై. సింహాచలం తెలిపారు.

# జానపాటి కుటుంబాన్ని ఫోను ద్వారా పరామర్శించిన బాలినేని



**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 31**

మండల కేంద్రమైన సి.ఎస్.పురం గ్రామానికి చెందిన మండల జనసేన పార్టీ అధ్యక్షులు జానపాటి రాజశేఖర్ (42) ఇటీవల అనారోగ్యంతో మరణించడం పట్ల మాజీ మంత్రి, జనసేన పార్టీ సీనియర్ నాయకులు బాలినేని శ్రీనివాసులురెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ ఈ విషాద విషయాన్ని బాలినేని శ్రీనివాసులురెడ్డికి తెలియజేయగా, ఆయన వెంటనే స్పందించి ఫోన్ ద్వారా రాజశేఖర్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యంగా ఉండాలని, త్వరలో వచ్చి కలిసి మాట్లాడుతానని కుటుంబ సభ్యులకు తెలిపారు.

# భోగాపురం ఎయిర్‌పోర్ట్ టూ విశాఖ- బస్సులే బస్సులు !

**హైదరాబాద్ పెన్ పవర్:** విశాఖ నుంచి ఎయిర్ పోర్టు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్ళిపోతుంది. కేవలం నెల రోజులు మాత్రమే సమయం ఉంది. ఇక మీదట ఎయిర్ ట్రావెలర్స్ అంతా భోగాపురం వెళ్ళి అక్కడ నుంచి మాత్రమే డొమెస్టిక్ ఫ్లైట్ల నుంచి అన్ని రకాల ఫ్లైట్లు ఎక్కాల్సి ఉంటుంది. అయితే విశాఖకు అరవై కిలోమీటర్ల పైగా దూరం ఉన్న భోగాపురం విమానాశ్రయానికి చేరుకునే దారేదీ అని విమర్శలు ఇప్పటిదాకా వినిపించాయి. భోగాపురం నుంచి విశాఖకు ఎనిమిది లైన్ల రోడ్లు వేస్తున్నారు. అలాగే అనకాపల్లి రూట్లో సెమీ రింగ్ రోడ్డుని డెవలప్ చేస్తున్నారు. ఇక జూలైలో ఎయిర్ పోర్టు ఆపరేషన్స్ స్టార్ట్ అయ్యేనాటికి బస్సులను కూడా పెద్ద ఎత్తున అక్కడికి చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ విధంగా రవాణా సమస్య లేకుండా పూర్తి జాగ్రత్తలను కూటమి ప్రభుత్వం తీసుకుంటోంది.

**ఎయిర్ పోర్టు నుంచి 40 ప్రత్యేక బస్సులు :**

ఇక భోగాపురం ఎయిర్ పోర్టు నుంచి విశాఖపట్నానికి ఏకంగా 40 ప్రత్యేక బస్సులు రాకపోకలు సాగించేలా చర్యలు చేపడుతున్నారు. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఏపీఎస్ఆర్టీసీ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. విశాఖపట్నం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి 40 ప్రత్యేక బస్సులను కేటాయించనున్నట్లు తెలిపారు. ఇవి ఈవీ బస్సులుగా ఉండబోతున్నాయి. దాంతో వేగంతో పాటు పర్యావరణ సమస్యలు లేకుండా సకాలంలో ప్రయాణీకులను అక్కడకి చేర్చి తిరిగి తీసుకుని రావడానికి ఉపయోగపడుతుందని అంటున్నారు.

**మొత్తం ఏడువందల దాకా :**

ఏపీలో ఆర్టీసీలో ఇపుడు సరికొత్త విప్లవం రాబోతోంది. ఏకంగా బస్సుల ఆధునీకరణ కోసం కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. ఈ క్రమంలో ఏడు వందల దాకా తొలి దశలో ఈవీ బస్సుల విస్తరణకు కూటమి ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. తొలి దశలో వచ్చే ఈ 700 ఈవీ బస్సులు రెండు నెలల్లో అందుబాటులోకి రానున్నాయని కూటమి ప్రభుత్వ పెద్దలు వెల్లడించారు. జూలై నెలలో ఆరు డిపోలలో ఈవీ బస్సుల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు సిద్ధం కానున్నాయని తెలిపారు.

**తిరుపతి కోసం సైతం :**

అదే విధంగా ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న ప్రఖ్యాత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తిరుపతి కోసం ప్రత్యేకంగా 300 ఈవీ బస్సులను కూటమి ప్రభుత్వం కేటాయించింది. అలాగే మరో 500 ఈవీ బస్సుల కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని అధికార వర్గాలు తెలిపాయి. ఇవే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా మూడు వేలకు పైగా ఈవీ బస్సులను రంగంలోకి దించి రవాణా రంగాన్ని మొత్తం ప్రక్షాళన చేసే దిశగా కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని కీలకమైన అడుగులు వేస్తోంది అని అంటున్నారు.

**ప్రైవేటీకరణ లేదు :**

ఏపీలో ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన అన్నది ఏ కోశానా కూటమి ప్రభుత్వానికి లేదని ముఖ్యమంత్రి అధ్యక్షత జరిగిన సమావేశంలో స్పష్టం చేయడం విశేషం. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ఆర్టీసీ అవినాభావ అనుబంధమని కూడా కూటమి ప్రభుత్వం పేర్కొంటోంది. ఇక ఏపీలో పీపీపీ విధానంలో అన్ని ఆర్టీసీ డిపోల ఆధునీకరణ చేపట్టేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని కూడా రవాణా మంత్రి రాం ప్రసాద్ రెడ్డి తెలిపారు.


**ఆర్టీసీకి కొత్త రూపు :**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే నైట్ ఔట్ అలవెన్స్ సహా ఉద్యోగుల పలు సమస్యలను పరిష్కరించినట్లు మంత్రి గుర్తుచేశారు. త్వరలో అందుబాటులోకి రానున్న కొత్త ఈవీ బస్సులతో ఏపీఎస్ఆర్టీసీకి మరింత కొత్త రూపు సంతరించుకుంటుందని మంత్రి చెప్పుకొచ్చారు. గత ఐదేళ్లలో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్న ఆర్టీసీని కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిందని మంత్రి పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న స్త్రీ శక్తి పథకం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుని కొనసాగుతోందని ఆయన చెప్పడం గమనార్హం.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# తల్లికి వందనంపై కీలక అప్ డేట్... పథకం పొందాలంటే ఇలా?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని వచ్చే నెలలో అమలు చేయాలని నిర్ణయించింది. తల్లికి వందనం నిధులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధం చేస్తుంది. ప్రతి ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలో తల్లికి వందనం నిధులను తల్లుల ఖాతాల్లో జమ చేస్తుంది. ఇందుకు ముహూర్తాన్ని కూడా ఫిక్స్ చేశారు. జూన్ 19 వ తేదీన నిధులను విడుదల చేయాలని నిర్ణయించారు. 2026-27 విద్యా సంవత్సరానికి జూన్ 19 వ తేదీ మెగా పీటీఎం ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. తల్లికి వందనం కింద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఉపయోగపడుతుందన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం.




**విద్యార్థికి పదిహేను వేలు...**

తల్లికి వందనం కింద పదిహేను వేల రూపాయల నిధులను ప్రతి విద్యార్థికిజమ చేస్తారు. ఒక కుటుంబంలో ఎంత మంది విద్యార్థులున్నప్పటికీ అందరికీ తలో పదిహేను వేలు ఇస్తామని ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాదితల్లికి వందనం నిధులను జమ చేశారు. ఈ ఏడాది బడ్జెట్ లోనూ తల్లికి వందనం కింద ప్రత్యేకంగా నిధులను కేటాయించిన ప్రభుత్వం వాటిని జమ చేయడానికి సిద్ధమవుతుంది. అయితే కొత్తగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులు తల్లికి వందనం నిధులు పొందడంపై ప్రభుత్వం ఈ క్లారిటీ ఇచ్చింది.

**డేటా వెరిఫికేషన్ అంటే...**

తల్లి వందనం పథకం కింద అర్హులైన విద్యార్థుల మరియు వారి తల్లుల వివరాలను సచివాలయ హౌసోల్డ్ డేటాబేస్ తో సరిపోల్చే డేటా వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ డేటా వెరిఫికేషన్ ను గ్రామ/వార్డు సచివాలయంలోని వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లేదా వార్డు వెల్ఫేర్ డెవలప్మెంట్ సెక్రటరీ ఈ వెరిఫికేషన్ పూర్తి చేయాలి.ఈ వెరిఫికేషన్ మాడ్యూల్ నవశకం లబ్ధిదారుల మేనేజ్ మెంట్ పోర్టల్ లో అందుబాటులో ఉంటుంది.

**తల్లి వివరాలు డేటాబేస్ లో లేకుంటే...**

తల్లి అందుబాటులో ఉంటే ఆమెను హౌసోల్డ్ డేటాబేస్ లో చేర్చాలి. లేనిపక్షంలో తండ్రి లేదా గార్డియన్ వివరాలను నమోదు చేయాలి. విద్యార్థి మరియు తల్లి వేర్వేరు కుటుంబాలలో ఉంటే ఎలా సరిచేసుకోవాలో కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. మైగ్రేషన్ ఆప్షన్ ఉపయోగించి వారిద్దరినీ ఒకే హౌస్ హోల్డ్ కిందకు తీసుకురావాలి.ఒకే తల్లికి నలుగురు కంటే ఎక్కువ పిల్లలు ఉంటే క్షేత్రస్థాయికి వెళ్లి పిల్లలందరూ ఆ తల్లికే జన్మించారా లేదా అనేది వెరిఫై చేసి, సరైన రిమార్కులు నమోదు చేయాలి.విద్యార్థి మరియు తల్లికి ఒకే ఐడీ నంబర్ ఉంటే సదరు ఐడీ నంబర్ ను సరైన వ్యక్తికి ట్యాగ్ చేసి, రెండో వ్యక్తి యొక్క అసలైన ఐడీ వివరాలను సేకరించి అప్ డేట్ చేయాలి.ఒకటో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులందరికీ ఇది వర్తిస్తుంది.

**డేటా వెరిఫికేషన్ తప్పుయితే...**

డేటా వెరిఫికేషన్ సకాలంలో మరియు ఖచ్చితంగా పూర్తి చేయకపోతే అర్హులైన విద్యార్థులకు తల్లికి వందనం పథకం నిధులు నిలిచిపోయే అవకాశం ఉంది. సచివాలయ ఉద్యోగులు ఈ ఐదు రకాల సమస్యలను పరిష్కరించి వెరిఫికేషన్ పూర్తి చేసిన తర్వాతే తుది అర్హుల జాబితా విడుదలవుతుంది.


# తల్లికి వందనంపై కీలక అప్ డేట్... పథకం పొందాలంటే ఇలా?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని వచ్చే నెలలో అమలు చేయాలని నిర్ణయించింది. తల్లికి వందనం నిధులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధం చేస్తుంది. ప్రతి ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలో తల్లికి వందనం నిధులను తల్లుల ఖాతాల్లో జమ చేస్తుంది. ఇందుకు ముహూర్తాన్ని కూడా ఫిక్స్ చేశారు. జూన్ 19 వ తేదీన నిధులను విడుదల చేయాలని నిర్ణయించారు. 2026-27 విద్యా సంవత్సరానికి జూన్ 19 వ తేదీ మెగా పీటీఎం ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. తల్లికి వందనం కింద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఉపయోగపడుతుందన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం.

**విద్యార్థికి పదిహేను వేలు...**

తల్లికి వందనం కింద పదిహేను వేల రూపాయల నిధులను ప్రతి విద్యార్థికిజమ చేస్తారు. ఒక కుటుంబంలో ఎంత మంది విద్యార్థులున్నప్పటికీ అందరికీ తలో పదిహేను వేలు ఇస్తామని ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాదితల్లికి వందనం నిధులను జమ చేశారు. ఈ ఏడాది బడ్జెట్ లోనూ తల్లికి వందనం కింద ప్రత్యేకంగా నిధులను కేటాయించిన ప్రభుత్వం వాటిని జమ చేయడానికి సిద్ధమవుతుంది. అయితే కొత్తగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులు తల్లికి వందనం నిధులు పొందడంపై ప్రభుత్వం ఈ క్లారిటీ ఇచ్చింది.

**డేటా వెరిఫికేషన్ అంటే...**

తల్లి వందనం పథకం కింద అర్హులైన విద్యార్థుల మరియు వారి తల్లుల వివరాలను సచివాలయ హౌసోల్డ్ డేటాబేస్ తో సరిపోల్చే డేటా వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ డేటా వెరిఫికేషన్ ను గ్రామ/వార్డు సచివాలయంలోని వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లేదా వార్డు వెల్ఫేర్ డెవలప్మెంట్ సెక్రటరీ ఈ వెరిఫికేషన్ పూర్తి చేయాలి.ఈ వెరిఫికేషన్ మాడ్యూల్ నవశకం లబ్ధిదారుల మేనేజ్ మెంట్ పోర్టల్ లో అందుబాటులో ఉంటుంది.

**తల్లి వివరాలు డేటాబేస్ లో లేకుంటే...**

తల్లి అందుబాటులో ఉంటే ఆమెను హౌసోల్డ్ డేటాబేస్ లో చేర్చాలి. లేనిపక్షంలో తండ్రి లేదా గార్డియన్ వివరాలను నమోదు చేయాలి. విద్యార్థి మరియు తల్లి వేర్వేరు కుటుంబాలలో ఉంటే ఎలా సరిచేసుకోవాలో కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. మైగ్రేషన్ ఆప్షన్ ఉపయోగించి వారిద్దరినీ ఒకే హౌస్ హోల్డ్ కిందకు తీసుకురావాలి.ఒకే తల్లికి నలుగురు కంటే ఎక్కువ పిల్లలు ఉంటే క్షేత్రస్థాయికి వెళ్లి పిల్లలందరూ ఆ తల్లికే జన్మించారా లేదా అనేది వెరిఫై చేసి, సరైన రిమార్కులు నమోదు చేయాలి.విద్యార్థి మరియు తల్లికి ఒకే ఐడీ నంబర్ ఉంటే సదరు ఐడీ నంబర్ ను సరైన వ్యక్తికి ట్యాగ్ చేసి, రెండో వ్యక్తి యొక్క అసలైన ఐడీ వివరాలను సేకరించి అప్ డేట్ చేయాలి.ఒకటో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులందరికీ ఇది వర్తిస్తుంది.

**డేటా వెరిఫికేషన్ తప్పుయితే...**

డేటా వెరిఫికేషన్ సకాలంలో మరియు ఖచ్చితంగా పూర్తి చేయకపోతే అర్హులైన విద్యార్థులకు తల్లికి వందనం పథకం నిధులు నిలిచిపోయే అవకాశం ఉంది. సచివాలయ ఉద్యోగులు ఈ ఐదు రకాల సమస్యలను పరిష్కరించి వెరిఫికేషన్ పూర్తి చేసిన తర్వాతే తుది అర్హుల జాబితా విడుదలవుతుంది.


# కూటమి మంత్రి సామాన్యుడు కాదు సుమా !

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో 2024 ఎన్నికల్లో బీజేపీ నుంచి సత్య కుమార్ యాదవ్ అనంతపురం జిల్లా ధర్మవరం అసెంబ్లీ సీటు నుంచి చివరి నిముషంలో పోటీకి దిగి గెలిచారు. ఆ తరువాత కూటమి ప్రభుత్వంలో ఆయన మంత్రిగా కూడా అయ్యారు. కీలకమైన వైద్య ఆరోగ్య శాఖలు ఆయనకు దక్కాయి. తనకు అప్పగించిన శాఖల విషయంలో ఆయన ఎంతో సమర్థంగా పనిచేస్తూ వస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మెప్పు కూడా పొందుతూ ముందుకు సాగుతున్నారు. ఇక సత్యకుమార్ యాదవ్ ఏపీకి చెందిన నేత అయినప్పటికీ ఆయన ఏపీ కంటే జాతీయ స్థాయి లోనే ఎక్కువగా పనిచేశారు. ప్రత్యేకించి ఆయనకు కేంద్ర పెద్దలు ప్రధాని నరేంద్ర మోడీ హోం మంత్రి అమిత్ షాతో నేరుగానే సంబంధాలు ఉన్నాయి.



**ఎంపీగా దిగాల్సింది :**

అయితే సత్య కుమార్ యాదవ్ 2024 ఎన్నికల్లో ఎంపీగానే బరిలోకి దిగాల్సింది అన్న ప్రచారం సాగింది. అయితే పొత్తులలో సర్దుబాటు కుదరకపోవడంతో ఆయనను ఎలాగైనా ప్రత్యక్ష ఎన్నికల్లో దించాలని బీజేపీ ప్రత్యేకమైన ఫోకస్ పెట్టడం వల్లనే ధర్మవరం నుంచి ఆయన లాస్ట్ మినిట్ లో అభ్యర్థి అయ్యారు. ఇక ఆయన ఎన్నికల ప్రచారం కోసం ఏకంగా కేంద్ర మంత్రి అమిత్ షా వచ్చారు అంటేనే ఆయనంటే బీజేపీ పెద్దలకు ఉన్న అభిమానం సాన్నిహిత్యం అర్థం అవుతాయని అంటారు. ఇక సత్యకుమార్ యాదవ్ కి జాతీయ స్థాయిలో ఎంతో పలుకుబడి కేంద్ర మంత్రులు నాయకులతో మంచి పరిచయాలు ఉన్నా ఏ రోజూ ఆయన తానుగా బయటకు చెప్పుకోలేదు. కానీ ఒక కేంద్ర మంత్రి మాత్రం సత్యకుమార్ గురించి జాతీయ స్థాయిలో ఆయన పలుకుబడి గురించి ఒక్క మాటలో చెప్పేశారు.

**మా బడా సాబ్ అంటూ :**

ఏపీలో రెండు రోజుల పర్యటనకు వచ్చిన కేంద్ర వస్త్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ విశాఖలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడకు వచ్చిన బీజేపీ మంత్రి సత్య కుమార్ యాదవ్ ని చూసి సత్యాజీ అంటూ ఎంతో అప్యాయంగా పలకరించారు. అంతే కాదు ఈయన మాకు బడా సాబ్ అంటూ అందరికీ పరిచయం చేశారు. ఈ సంఘటన విశాఖ విమానాశ్రయం వద్ద జరిగింది. కేంద్ర మంత్రి ఆ విధంగా సత్య కుమార్ యాదవ్ తో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని పంచుకుంటూ ఎంతో ఆప్యాయంగా పలకరించడమే కాదు ఆయన మాకు నాయకుడు అని చెప్పుకుని మురిసిపోవడం అక్కడ చూసిన వారికి అందరికీ ఆశ్చర్యంతో పాటు ఆసక్తిని కలిగించింది. గతంలో తాము ఇరువురు కలిసి పనిచేసిన సందర్భాలను కేంద్ర మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

**ఎన్నికల కోసం :**

గతంలో యూపీ సహా కీలక రాష్ట్రాలలో ఎన్నికల కోసం సత్య కుమార్ యాదవ్ పనిచేసిన సందర్భాలు ఉన్నాయి. బీజేపీకి అకుంఠితమైన సేవకుడిగా పార్టీ బాధ్యతలు ఎక్కడ అప్పగిస్తే అక్కడకు వెళ్ళి పనిచేసి విజయాన్ని చేకూర్చిన ఘనత సత్య కుమార్ యాదవ్ కి దక్కుతుంది. యూపీ చీఫ్ మినిస్టర్ యోగి ఆదిత్య నాథ్ తో సహా ఎంతో మంది బీజేపీ ముఖ్యమంత్రుల వద్ద కూడా సత్య కుమార్ యాదవ్ కి మంచి పలుకుబడి ఉంది. అయితే ఆయన ఇపుడు ఏపీ మంత్రిగా రాష్ట్రానికే పరిమితం అయి తన బాధ్యతలను నిర్వహిస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఆయన ఎంపీ అయి కేంద్ర రాజకీయాల్లోకి వెళ్తారు అన్న ప్రచారం కూడా ఉనిద్. ఇదిలా ఉంటే తన పట్ల ఆప్యాయత చూపించిన కేంద్ర మంత్రికి సత్యకుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. అంతే కాదు దేశంలో మంజూరైన ఏకైక మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గానికి మంజూరు చేసినందుకు గిరిరాజ్ సింగ్ కి సత్య కుమార్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

# మాజీ మంత్రి రిటైర్మెంట్ కి రెడీ...కొడుక్కి మాత్రం ?

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో సీనియర్ల శకం దాదాపుగా ముగిసినట్లే అని అంటున్నారు. ఇంకా ఉత్సాహంగా పార్టీ కోసం పనిచేయాలీ అనుకుంటే వారి సలహా సూచనలు తీసుకుంటారు కానీ కీలకమైన పదవులలో మాత్రం చాన్స్ ఉండదని చెప్పకనే చెప్పేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీ లేదా ఎమ్మెల్యే టికెట్ సీనియర్లకు దొరకడం దుర్లభమే అన్న మాట కూడా వినిపిస్తోంది. ఇప్పటికే టీడీపీ యువ నేత జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ టీడీపీని నవ శకం వైపుగా నడిపిస్తునారు. దాంతో కొత్త వారికి నాలుగు పదుల వయసు లోపు వారికి మాత్రమే అధికంగా అవకాశాలు అయితే పార్టీలో ఉన్నాయని చెబుతున్నారు తెలుగుదేశం పుట్టాక ఇంత పెద్ద ఎత్తున పరిణామ ప్రక్రియ కొత్త రూపు తీసుకోవడం అన్నది ఇదే ప్రథమం. దాంతో సీనియర్లు కూడా విషయం మొత్తం అర్థం చేసుకుని తమదైన వ్యూహాలకు పదును పెడుతున్నారు.



**రిటైర్మెంట్ బెస్ట్ :**

ఒకనాడు తెలుగుదేశంలో ఒక వెలుగు వెలిగి ఏపీకి తొలి టీడీపీ ప్రెసిడెంట్ గా పనిచేసిన వారు కిమిడి కళా వెంకట్రావు. ఆయన 1983 నుంచి తన రాజకీయాలను కొనసాగిస్తూ వస్తున్నారు. అన్న ఎన్టీఆర్ నుంచి నేరుగా టికెట్ సాధించి ఎమ్మెల్యేగా గెలిచి అదే ఎన్టీఆర్ కేబినెట్ లో పలు కీలక మంత్రిత్వ శాఖలతో పాటు ఏకంగా హోం శాఖ కూడా చేపట్టిన ఘనత కిమిడి కళా వెంకట్రావుకు దక్కుతుంది. ఇక ఆయన రాజ్యసభకు కూడా వెళ్ళి ఆరేళ్ళ పాటు ఆ పదవిలో ఉన్నారు. గతంలో ఉణుకూరు నుంచి అనేక సార్లు ఎమెల్యేగా గెలిచిన ఆయన 2009లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్ విభజనలో ఎచ్చెర్లకు మారారు. అక్కడ 2014లో గెలిచి చంద్రబాబు కేబినెట్ లో విద్యుత్ శాఖను నిర్వహించారు.

**చివరి నిముషంలో సీటు :**

ఇక జగన్ ప్రభంజనంలో 2019 ఎన్నికల్లో ఓటమి పాలు అయిన కళా వెంకట్రావు అయిదేళ్ళ పాటు ఎచ్చెర్లలోనే గట్టిగా పనిచేసి విజయ ఢంకా మోగించడానికి సర్వం సిద్ధం చేసుకున్నారు. అయితే పొత్తులలో భాగంగా ఆ సీటు బీజేపీకి వెళ్ళిపోయింది. ఈశ్వరరావు ఎమ్మెల్యే అయ్యారు. కళా వెంకటరావుని చీపురుపల్లికి బదిలీ చేశారు. అలా చివరి నిముషంలో వచ్చినా అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ మీద భారీ మెజారిటీతో కళా గెలిచి వచ్చారు. కళాకు మంత్రి వర్గంలో స్థానం ఖాయమని ఆయన అనుచరులు ధీమా వ్యక్తం చేశారు. అయితే కళాకు కాకుండా కొత్తగా తొలిసారి ఎమ్మెల్యే అయిన గజపతినగరం నేత కొండపల్లి శ్రీనివాస్ కి మంత్రి యోగం పట్టింది. దాంతో కళా వర్గం డీలా పడింది. ఇక తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ పదవి మీద కూడా కళా ఆశలు పెట్టుకున్నారని అంటున్నారు. మరి ఆ ఆశ ఏ మేరకు నెరవేరుతుందో తెలియదు. మంత్రి అయితే లేదని కళా వర్గం డిసైడ్ అయినట్లుగా చెబుతున్నారు.

**ఎచ్చేర్ల మీదనే ఫోకస్ :**

ఇదిలా ఉంటే చీపురుపల్లి నుంచి ఎమ్మెల్యేగా ఉన్నా కూడా కళా ఎచ్చెర్ల మీదనే ఫోకస్ పెట్టారని అంటున్నారు. పైగా చీపురుపల్లిలో కళా తమ్ముడి కుమారుడు కిమిడి నాగార్జున పోటీలో ఉన్నారు. ఆయన 2019లో అక్కడ నుంచి పోటీ చేసి ఓటమి పాలు అయ్యారు. 2029లో ఆయనకు టికెట్ ఖాయమని అంటున్నారు. ఆయన ప్రస్తుతం డీసీసీబీ చైర్మన్ తో పాటు విజయనగరం జిల్లా టీడీపీ ప్రెసిడెంట్ గా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో తన కుమారుడు కిమిడి రాం మల్లిక్ కి ఎచ్చెర్ల టికెట్ కేటాయించాలని కళా టీడీపీ పెద్దలను కోరుతున్నారని అంటున్నారు. ఆ టికెట్ ఇస్తేనే పోటీ చేస్తారని కూడా చెబుతున్నారు. వేరే చోటకు ఈసారి కళా కుటుంబం వెళ్లేది లేదని కూడా అంటున్నారు. మొత్తానికి మూడేళ్ళ ముందే కళా తన కుమారుడి రాజకీయ భవిష్యత్తు కోసం వ్యూహ రచన చేస్తున్నారు. అంతే కాదు తాను ఇక మీదట ఎన్నికల్లో పోటీ చేసేది లేదని కూడా ఆయన అనుచరులతో చెబుతున్నారని ప్రచారం అయితే సాగుతోంది. మొత్తానికి ఈ సీనియర్ ఆశలు ఏ మేరకు నెరవేరుతాయన్నది చూడాల్సి ఉంది.

# ఫైనల్‌లో కోహ్లీ షో.. గుజరాత్‌ను చిత్తు చేసి వరుసగా రెండోసారి కప్పు కొట్టిన ఆర్సీబీ



అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా జరిగిన ఐపీఎల్ 2026 గ్రాండ్ ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సంచలన విజయం సాధించింది. గుజరాత్ టైటాన్స్ పై గెలిచి, వరుసగా రెండోసారి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది. ఈ చారిత్రాత్మక గెలుపుతో ఐపీఎల్ చరిత్రలో బ్యాక్-టు-బ్యాక్ టైటిల్స్ కొట్టిన చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ వంటి దిగ్గజ జట్ల సరసన ఆర్సీబీ సగర్వంగా నిలిచింది. టాస్ గెలిచి మొదట ఫీల్డింగ్ తీసుకున్న ఆర్సీబీ.. గుజరాత్‌ను నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 155 పరుగులకే కట్టడి చేసింది. ఆ తర్వాత 156 పరుగుల టార్గెట్‌ను కింగ్ కోహ్లీ వన్-మెన్ షోతో చెలరేగిపోయాడు.

**పవర్‌ప్లే ఆర్సీబీ దండయాత్ర:**

ఈజీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఆర్సీబీకి ఓపెనర్లు వెంకటేశ్ అయ్యర్, విరాట్ కోహ్లీ పవర్‌ప్లేలో నెక్స్ట్ లెవెల్ స్టార్ట్ ఇచ్చారు. గుజరాత్ బౌలర్లపై విరుచుకుపడుతూ వీరిద్దరి మధ్య 62 పరుగుల ఓపెనింగ్ పార్ట్‌నర్‌షిప్‌తో మ్యాచ్‌ను వన్-సైడ్ చేశారు. అయితే ఈ ప్రమాదకరమైన జోడీని గుజరాత్ స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ దెబ్బకొట్టాడు. కేవలం 16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 పరుగులు చేసి ఊపుమీదున్న వెంకటేశ్ అయ్యర్‌ను సిరాజ్ అవుట్ చేశాడు. సిరాజ్ వేసిన అద్భుతమైన బంతికి కగిసో రబాడకు క్యాచ్ ఇచ్చి అయ్యర్ పెవిలియన్ చేరాడు.

**ఆర్సీబీకి బ్రేకులు వేసిన రషీద్ ఖాన్:**

వెంకటేశ్ అవుట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన దేవదత్ పడిక్కల్ ఘోరంగా నిరాశపరిచాడు. కేవలం 1 రన్ మాత్రమే చేసి కగిసో రబాడ బౌలింగ్‌లో అర్షద్ ఖాన్‌కు క్యాచ్ ఇచ్చి చేతులెత్తేశాడు. ఈ దశలో వచ్చిన ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటిదార్ వచ్చి రావడంతోనే ఒక ఫోర్, సిక్స్ బాది ఫుల్ జోష్ చూపించినా.. ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. గుజరాత్ స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ బౌలింగ్‌లో పటిదార్ అవుట్ అయ్యాడు. అదే ఓవర్లో నాలుగో బంతికి కృనాల్ పాండ్యాను కూడా రషీద్ ఖాన్ ఎల్బీడబ్ల్యూ (ాదీఔ) చేయడంతో ఆర్సీబీ 91 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కాస్త ఇబ్బందుల్లో పడింది.

**కోహ్లీ విధ్వంసం:**

4 వికెట్స్ పడ్డాక మ్యాచ్‌ను మళ్లీ ఆర్సీబీ వైపు తిప్పే బాధ్యతను టిమ్ డేవిడ్ చెలరేగిపోయాడు. బౌండరీలతో గుజరాత్ టైటాన్స్ బౌలర్లపై విరుచుకుపడుతూ స్కోరు బోర్డును పరిగెత్తించాడు. అయితే భారీ షాట్ కొట్టే క్రమంలో అర్షద్ ఖాన్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ జోస్ బట్లర్‌కు క్యాచ్ ఇచ్చి డేవిడ్ డగౌట్‌కు చేరుకున్నాడు. కానీ మరో ఎండ్‌లో మొండిగా నిలబడ్డ

ఆర్సీబీ రన్ మెషీన్ విరాట్ కోహ్లీ అసలైన క్లాస్ చూపించాడు. గుజరాత్ బౌలర్లను ముప్పుతిప్పలు పెడుతూ తన ఐపీఎల్ కెరీర్‌లోనే ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ (42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సులతో 75 పరుగులతో నాటౌట్) బాదాడు. కోహ్లీ అజేయ ఇన్నింగ్స్‌తో ఆర్సీబీకి తిరుగులేని విజయాన్ని అందించాడు. నిన్న మొన్నటి వరకు ఈ సాల కప్ నమ్దే అన్న ఆర్సీబీ ఫ్యాన్స్.. ఇప్పుడు ఈ సాల కూడా కప్ నమ్దూ అంటూ సంబరాలు చేసుకుంటున్నారు.

# అతనో స్పెషల్ ట్యాలెంట్.. లైన్ అండ్ లెంగ్త్ పసిగట్టడంలో దిట్ట: వైభవ్ బ్యాటింగ్‌కు సచిన్ ఫిదా!





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై ప్రశంసల వర్షం కురిపించాడు. వైభవ్ ఒక అసాధారణమైన, ప్రత్యేకమైన ప్రతిభావంతుడని కొనియాడాడు. బంతి లైన్ అండ్ లెంగ్త్‌ను ముందుగానే పసిగట్టి, మైదానంలో నచ్చిన చోటికి తరలించే అతని నైపుణ్యానికి తాను ముగ్ధుడనయ్యానని సచిన్ పేర్కొన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్ సూర్యవంశీ, 237.31 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 776 పరుగులు సాధించి సంచలనం సృష్టించాడు. ఈ క్రమంలో 72 సిక్సులు బాది, ఒకే ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సులు (59) కొట్టిన క్రిస్ గేల్ రికార్డును బద్దలు కొట్టాడు.

ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో సచిన్ మాట్లాడుతూ.. "అందరూ వైభవ్ సూర్యవంశీ గురించే మాట్లాడుకుంటున్నారు. నేను అతని బ్యాటింగ్ చూశాను. అది అద్భుతంగా ఉంది. అతను నిజంగా చాలా ప్రత్యేకమైన ఆటగాడు. కేవలం బంతిని బలంగా బాదడమే కాదు, అతని మణికట్టును ఉపయోగించే తీరు నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. గ్రౌండ్‌లో అన్ని వైపులా ఆడాలంటే మంచి రిస్ట్ వర్క్ అవసరం. అతను బంతిని గుడ్డిగా బాదడం లేదు. మిగతా వారికంటే ముందుగా లైన్ అండ్ లెంగ్త్‌ను గ్రహించి, అలవోకగా బౌండరీ లైన్ దాటిస్తున్నాడు" అని వివరించాడు.

**యువ ఆటగాడికి సచిన్ కీలక సలహా**

ఈ సందర్భంగా యువ ఆటగాడికి సచిన్ ఒక ముఖ్యమైన సలహా కూడా ఇచ్చాడు. "నేను అతనికి చెప్పేది ఒకటే, నువ్వు నువ్వుగానే ఉండు. కెరీర్‌లో ఎదురయ్యే సవాళ్లకు భయపడకుండా, పరిష్కార మార్గాలను అన్వేషించాలి. సమస్యలు అనేవి కెరీర్ చివరి రోజు వరకు, ఆఖరి బంతి ఎదుర్కొనే వరకు ఉంటాయి. బౌలర్ ప్రతి బంతికీ ఒక ప్రశ్న సంధిస్తాడు, దానికి నువ్వు ఎలాంటి పరిష్కారాలు కనుక్కుంటావనేదే ముఖ్యం. అతను చాలా ఆత్మవిశ్వాసంతో కనబడుతున్నాడు. అతని సహజమైన ఆటతీరును మార్చాలనుకోవడం లేదు" అని అన్నాడు. భవిష్యత్తులో వైభవ్ భారత టెస్ట్ జట్టుకు ఆడాలని తాను కోరుకుంటున్నట్లు సచిన్ తెలిపాడు. అయితే, ఈ యువ ప్రతిభపై అభిమానులు, నిపుణులు ఎలాంటి అంచనాల ఒత్తిడి పెట్టవద్దని విజ్ఞప్తి చేశాడు. అతని ఆటను ప్రోత్సహించి, ఆస్వాదించాలని, సెలక్షన్ బాధ్యతలను సెలక్టర్లకే వదిలేయాలని సూచించాడు. వైభవ్ గురించి సచిన్ మాట్లాడటం ఇది మొదటిసారి కాదు. గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైభవ్ 97 పరుగుల వద్ద అద్భుత ఇన్నింగ్స్ ఆడినప్పుడు కూడా సచిన్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రశంసించాడు. "వైభవ్ బ్యాట్ స్వింగ్ అద్భుతంగా ఉంది. ముఖ్యంగా కాళ్ల మీదకు వచ్చే బంతుల కోసం ఫ్రంట్ ఫుట్‌ను తెలివిగా క్లియర్ చేసుకుని, స్వేచ్ఛగా సిక్సులు కొట్టే తీరు అమోఘం" అని పోస్ట్ చేశాడు.

# ఫైనల్ కూడా మామూలు గేమే.. గతేడాది జ్ఞాపకాలే మా బలం: ఆర్సీబీ కెప్టెన్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 ఫైనల్ సమరానికి ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో జరగబోయే టైటిల్ పోరును ఒక 'మామూలు గేమ్'గానే పరిగణిస్తున్నామని, ఎలాంటి ఒత్తిడికి లోనవడం లేదని స్పష్టం చేశాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న తమ జట్టు పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉందని తెలిపాడు. ఈ సీజన్‌లో ఆర్సీబీ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించింది. లీగ్ దశలో టేబుల్ టాపర్‌గా నిలిచి, క్వాలిఫయర్ 1లో గుజరాత్ టైటాన్స్‌పై 92 పరుగుల భారీ తేడాతో గెలిచి నేరుగా ఫైనల్‌కు అర్హత సాధించింది. ఫైనల్ నేపథ్యంలో ఆర్సీబీ విడుదల చేసిన ఓ వీడియోలో పాటిదార్ మాట్లాడాడు. "వరుసగా రెండోసారి ఫైనల్ ఆడుతుండటం, అదీ గతేడాది కప్ గెలిచిన ఇదే మైదానంలో కావడం చాలా సంతోషంగా ఉంది. గతేడాదికి సంబంధించిన ఎన్నో మధుర జ్ఞాపకాలు ఇక్కడ ఉన్నాయి. ఇది ఫైనల్, పెద్ద వేదిక అని తెలుసు. కానీ నా వరకు ఇదొక సాధారణ మ్యాచ్ మాత్రమే" అని అన్నాడు. భారీ అంచనాలున్న మ్యాచ్‌ను కూడా సాధారణ మ్యాచ్‌లాగే తీసుకోవడం తనకు అలవాటని పాటిదార్ వివరించాడు.

"నేను ఎప్పుడూ వర్తమానంలో ఉండటానికే ప్రయత్నిస్తాను. ఇది ఫైనల్ కదా, ఏం జరగబోతోంది, ఫలితం ఎలా ఉంటుంది అనే విషయాల గురించి ఎక్కువగా ఆలోచించను. ఫలితంతో సంబంధం లేకుండా ప్రశాంతంగా ఉండాలనుకుంటున్నాను" అని తన ఆలోచనా విధానాన్ని పంచుకున్నాడు. ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు జట్టుగా ఆడిన తీరు గర్వంగా ఉందని, ప్రతీ ఒక్కరూ జట్టు కోసం తమ వంతు కృషి చేశారని కొనియాడాడు.

కోచ్ ఆండీ ఫ్లవర్ కూడా కెప్టెన్ మాటలతో ఏకీభవించాడు. "వరుసగా ఫైనల్స్‌కు చేరడం గొప్ప విషయం. ఇక్కడికి చేరుకోవడానికి కుర్రాళ్లు చాలా కష్టపడ్డారు. ఈ లీగ్‌లో టేబుల్ టాపర్‌గా నిలవడానికి ఎంతో ధైర్యం కావాలి. అయితే, ఇంకా చేయాల్సింది మిగిలే ఉంది" అని అన్నాడు. ఒత్తిడి పెరిగినప్పుడు విషయాలను సింపుల్‌గా ఆలోచించడం మంచిదని, ఫైనల్‌లో ఆటగాళ్లు అదే వ్యూహంతో బరిలోకి దిగుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశాడు.

మరి కొన్ని గంటల్లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగే ఫైనల్‌లో గెలిచి, వరుసగా రెండోసారి టైటిల్ సాధించి, ఐపీఎల్ చరిత్రలో ఈ ఘనత సాధించిన మూడో జట్టుగా నిలవాలని ఆర్సీబీ పట్టుదలగా ఉంది.

# పారడైజ్ కి పాన్-ఇండియా రేసులో భారీ పోటీ!

నేచురల్ స్టార్ నానికి ఇంకా సరైన పాన్ ఇండియా హిట్ పడలేదు. -దసరా-తో ఓ అటెంప్ట్ చేసాడు గానీ అది రీజనల్ గానే కనెక్ట్ అయింది. పాన్ ఇండియాలో అనుకున్నంత గొప్ప ఫలితాలు సాధించలేదు. కానీ -దసరా- విజయం మాత్రం నాని కెరీర్ లో ఓ మైలు రాయి అనే చెప్పాలి. అదే కాన్ఫిడెన్స్ తో మరోసారి శ్రీకాంత్ ఓదెలతో పాన్ ఇండియా అటెంప్ట్ చేస్తోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇద్దరి కాంబినేషన్ లో -ది ప్యారడైజ్- తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. నాని కెరీర్‌లోనే అత్యధికంగా 150 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోన్న చిత్రమిది. ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలున్నాయి. ఈ ఈ హై-వోల్టేజ్ చిత్రంతో నాని పాన్-ఇండియా స్థాయిలో తన మార్కెట్ పరిధిని మరింత విస్తరించుకోవాలని పక్కా ప్లానింగ్‌తో ఉన్నారు. అన్ని పనులు పూర్తి చేసుకుని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున విడుదలవుతుంది. ఈ నేపథ్యంలో మొదటి రోజే ఏకంగా 100 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించడమే టార్గెట్ గా చిత్ర బృందం ప్రమోషన్స్, థియేట్రికల్ ప్లానింగ్‌ను సిద్ధం చేస్తోంది. మీడియం రేంజ్ హీరో స్థాయి నుండి గ్లోబల్ లీగ్‌లోకి అడుగుపెడుతున్న నానికి 100 కోట్ల ఓపెనింగ్స్ టార్గెట్ అనేది అత్యంత ప్రతిష్టాత్మకమైనదిగా చెప్పొచ్చు. అయితే ఈ కలల రికార్డును అందుకోవడం అంత సులువు కాదని ఇండస్ట్రీ సమీకరణాలు చెప్తున్నాయి. -పారడైజ్- విడుదలకు సరిగ్గా వారం రోజుల ముందు అంటే ఆగస్టు 14న కోలీవుడ్ స్టార్ హీరో సూర్య



నటించిన క్రేజీ మూవీ -విశ్వనాథ్ అండ్ సన్స్- థియేటర్లలోకి రానుంది. వారం రోజుల గ్యాప్ ఉన్నప్పటికీ ఇప్పటికే -కరుపు- చిత్రంతో 250 కోట్ల క్లబ్‌లో చేరిన సూర్య బాక్సాఫీస్ రేంజ్ తమిళనాడుతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ భారీగా ఉంటుంది. ఆగస్టు 21 నాటికి కూడా తమిళ మార్కెట్లో సూర్య సినిమా హోల్డ్ బలంగా ఉండే అవకాశం ఉండటంతో నాని చిత్రానికి అక్కడ థియేటర్ల కేటాయింపు - ఓపెనింగ్స్ పరంగా గట్టి పోటీ తప్పేలా లేదు. తమిళనాడు మాత్రమే కాదు. మాలీవుడ్ మార్కెట్లో కూడా -పారడైజ్- చిత్రానికి పెను సవాల్ తప్పడం లేదు. ఈ సినిమా విడుదలకు సరిగ్గా ఒక్క రోజు ముందు అంటే ఆగస్టు 20న మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన ఇద్దరు అగ్ర హీరోల సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. దుల్కర్ సల్మాన్ మోస్ట్ అవేటెడ్ మూవీ -ఐయామ్ గేమ్-, పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తోన్న-ఖలీఫా- చిత్రాలు ఒకే రోజు విడుదలవుతుండటంతో కేరళ బాక్సాఫీస్ వద్ద ఉత్కంఠ నెలకొంది. ఈ రెండు భారీ మలయాళ చిత్రాల పోటీ కారణంగా కేరళ వ్యాప్తంగా ఉన్న ప్రధాన థియేటర్లు, మల్టీప్లెక్స్ స్క్రీన్స్ అన్నీ స్థానిక సినిమాలకే దక్కే అవకాశం ఉంది. దీంతో ఆగస్టు 21న రిలీజ్ అయ్యే -పారడైజ్- చిత్రానికి మలయాళ మార్కెట్లో ఆశించిన స్థాయిలో థియేటర్లు దొరకడం కష్టమే. అదే జరిగితే ఓపెనింగ్ డే కలెక్షన్లపై కూడా తీవ్ర ప్రభావం తప్పదు. పాన్-ఇండియా స్థాయిలో 100 కోట్లు మొదటి రోజు సాధించాలంటే సౌత్ లోని అన్ని భాషల నుండి భారీ కాంట్రిబ్యూషన్ అవసరం. కానీ సన్నివేశం అందుకు భిన్నంగా కనిపిస్తోంది.

## సాక్షి మాలిక్ డ్రీమ్‌లాక్ ఎత్నిక్ లుక్‌లో స్టన్ చేసింది



## కృతి శెట్టి యొక్క అప్రయత్నమైన ఆకర్షణ వైరల్ టెర్రస్ ఫోటోలో మెరిసింది



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com